RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
# తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
The Voice of Telangana
Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,
సంపుటి: 16 సంచిక 27 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ శనివారం 02-05-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి
R N I No. APTEL/2012/53127
The Voice of Telangana
విలేకరులు కావలెను
తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
9182328292



అంతర్జాతీయ కార్మిక దినోత్సవ

## శుభాకాంక్షలు

### సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: శ్రమజీవుల కష్టానికి గౌరవం, గుర్తింపునిచ్చే 'అంతర్జాతీయ కార్మిక దినోత్సవం' సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక లోకానికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. కష్టం చేసిన ప్రతి చేతి విలువను గుర్తించి, సమానత్వం, న్యాయం, గౌరవం కోసం కలిసి ముందుకు సాగుదామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. "ప్రతి కార్మికుడి చెమట చుక్కలో మన సమాజ భవిష్యత్తు దాగి ఉంది. కార్మికుల అంకితభావం, కష్టపడే మనస్తత్వం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తుంది. వ్యవస్థీకృత, అసంఘటిత కార్మికుల హక్కులను కాపాడటంలో ప్రజాప్రభుత్వం నిరంతరం పాటుపడుతుంది" అని చెప్పారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని పేర్కొన్నారు.



గ్యాస్ ధరల పెంపు..

## ఎలక్షన్ బిల్లు

ధరలపై తాము ముందే చెప్పాం
పెట్రో, డీజిల్ బాదుడుకు సిద్దంగా ఉండాలి
గ్యాస్ ధర పెంపుపై రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ,మే1 : దేశంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు రూ.993 మేర పెరగడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. త్వరలో పెట్రోల్, డీజిల్ వంతు వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల తరువాత ధరాభారం పెరుగుతుందని తాను ముందే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది ఎలక్షన్ బిల్లు అని వ్యాఖ్యానించారు. ఎక్స్ వేదికగా ఈ మేరకు పోస్టు పెట్టారు. కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర మునుపెన్నడూ చూడని స్థాయిలో ఒక్కసారిగా పెరిగాయని రాహుల్ గాంధీ విమర్శించారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూరూ.1380ల మేరధర పెరిగిందని అన్నారు. కేవలం మూడు నెలల్లోనే ధర 81 శాతం మేర పెరిగిందని వివరించారు. ఎన్నికల తరువాత ఇలా జరుగుతుందని తాను ముందే చెప్పానని గుర్తు చేశారు. 'టీ స్టాల్స్, ధాబాలు, బేకరీ, స్వీట్ షాపులు.. ఇలా అందరిపైనా భారం పెరిగింది. చివరకు మీ ఆహార ఖర్చులపైనాప్రభావంపడుతుంది. మొదటఎల్పీజీగ్యాస్ వంతు.. ఆ తరువాత పెట్రోల్-డీజిల్ ధరల వంతు వస్తుంది' అని అన్నారు. ఎన్నికలు ముగిశాక దేశంలో పెట్రోల్ ధరలు పెరుగుతాయని రాహుల్ గాంధీ మంగళవారం పేర్కొన్నారు. 'అలర్ట్‌గా ఉండండి.. ఎన్నికల వల్ల కలిగిన ఉపశమనం ఇక ముగిసినట్టే. ఇంధన ధరలు తక్కువగా ఉన్నప్పుడు మోదీ ప్రభుత్వం లాభాలను దండుకుంది. ఇప్పుడు ధరలు పెరిగాయి కాబట్టి ధరాభారాన్ని ప్రజలపై పెడుతుంది' అని రాహుల్ అప్పట్లో విమర్శించారు



నోబెల్ శాంతి బహుమతి రేసులో..

## ట్రంప్

### 287 మందితో తుది జాబితా?

- ట్రంప్ పేరును సూచన ప్రాయంగా వెల్లడించిన నోబెల్ కమిటీ సెక్రటరీ
- తుది జాబితాలో 208 మంది వ్యక్తులు, 79 సంస్థలు ఉన్నాయన్న క్రిస్టియన్ బెర్గ్ హార్ప్‌వికెన్
- ట్రంప్‌ను నామినేట్ చేసిన కంబోడియా, ఇజ్రాయెల్, పాకిస్థాన్

వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ శాంతి బహుమతి-2026 కోసం నామినేషన్ల పర్వం ఆసక్తి రేపుతోంది. ఈ ఏడాది పురస్కారం కోసం మొత్తం 287 మంది అభ్యర్థులు షార్ట్‌లిస్ట్ అయినట్లు నార్వేజియన్ నోబెల్ కమిటీ సెక్రటరీ క్రిస్టియన్ బెర్గ్ హార్ప్‌వికెన్ గురువారం వెల్లడించారు. ఈ జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు కూడా ఉండే అవకాశం ఉందని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. ఈ ఏడాది జనవరిలో బాధ్యతలు స్వీకరించిన హార్ప్‌వికెన్ మాట్లాడుతూ తుది జాబితాలో 208 మంది వ్యక్తులు, 79 సంస్థలు ఉన్నాయని పేర్కొన్నారు.

2వ పేజీలో...

హైదరాబాద్: తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పోలీసు ఉన్నతాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యాలయ ఆవరణలో పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలతో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తానన్నారు. శాంతిభద్రతల కోసం అహర్నిశలూ శ్రమిస్తానని చెప్పారు. కొత్త టెక్నాలజీని మరింతగా వాడుకుంటూ సమర్థంగా పని చేస్తామన్నారు. "నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పని తీరు కనబరిచారు. మారుతున్న పరిస్థితుల్లాగే నేరాలు జరుగుతున్న విధానం కూడా మారింది. నేరగాళ్లు సైతం కొత్త కొత్త టెక్నాలజీని అనుసరిస్తూ నేరాలు చేస్తున్నారు.



2వ పేజీలో...

తెలంగాణ డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన

## సీవీ ఆనంద్



కర్ణాటక ముఖ్యమంత్రి మార్పుపై

## స్పందించిన మల్లికార్జున ఖర్గే

- సిద్ధరామయ్య సీఎంగా కొనసాగుతారని వ్యాఖ్య
- పార్టీ అధిష్ఠానం కూడా త్వరలో ఈ అంశంపై చర్చిస్తుందన్న ఖర్గే
- తాను సీఎం కావడానికి ఆ కుర్చీ ఖాళీగా లేదని వ్యాఖ్య

ఢిల్లీ,: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే మరోసారి స్పందించారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ఉండబోదని తెలిపారు. నాయకత్వ సమస్యపై నెలకొన్న గందరగోళాన్ని పార్టీ అధిష్ఠానం కూడా త్వరలోనే నివృత్తి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిద్ధరామయ్య సీఎంగా కొనసాగుతారని, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉండవచ్చుని చెప్పారు.

2వ పేజీలో...



2వ పేజీలో...

గ్యాస్ ధరల పెంపు

## సామాన్యుడిపై భారం

### ఏకంగా రూ.993లకు పెంచడం దుర్మార్గం కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, : కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం అమాంతం పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందని తెలంగాణ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై మంత్రి ఫైర్ అయ్యారు. గ్యాస్ ధర పెంపుతో సామాన్యుడిపై పెను భారం మోపారంటూ ఆగ్రహించారు. 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధరను రూ.993లకు అంటే సుమారు వెయ్యి రూపాయలకు పెంచడం దుర్మార్గమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు.




## పెట్రో ధరలు పెంచడం లేదు

### ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ వెల్లడి

న్యూఢిల్లీ,మే1 :దేశంలోని వాహనదారులకు, సామాన్య వినియోగదారులకు ఊరటనిచ్చే వార్తను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని సవరించినప్పటికీ, పెట్రోల్, డీజిల్ ధరలలో ప్రస్తుతానికి ఎలాంటి మార్పు ఉండబోదని, అవి స్థిరంగానే కొనసాగుతాయని స్పష్టం చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల ఒడిదొడుకులు, ప్రభుత్వ పన్నుల సవరణలు జరిగినప్పటికీ, సామాన్య వినియోగదారులపై అదనపు భారం పడకుండా చమురు సంస్థలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి.

2వ పేజీలో...




కమలంలో ఆగని

## కుమ్ములాటలు

2వ పేజీలో...

కరీంనగర్ ,మే1,: తెలంగాణ బీజేపీ నేతల తీరును సొంత పార్టీ కేడరే ఎండగడుతోంది. వ్యక్తిగతంగా వాళ్ళకు అక్కడ పదవులతో పని లేకున్నా? పార్టీని అధికారంలో నిలపాలన్న తాపత్రయంతో పెద్దోళ్ళంతా అలా కష్టపడుతున్నారు. కానీ?. ఇక్కడ తెలంగాణలో పార్టీని నిలిపి గెలిపిస్తే? ముఖ్యమంత్రి నుంచి మంత్రి పదవుల దాకా? వీళ్ళకే కదా? వస్తాయి, అయినా సరే? రాష్ట్ర బీజేపీ నాయకులు ఎందుకు నిర్లిప్తంగా ఉంటున్నారు, కనీస యాక్టివిటీ కూడా ఎందుకు ఉండటం లేదని కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకుల్లో చర్చ జరుగుతోంది. పైగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడుతున్నారు. ఇక్కడ పార్టీని గెలిపిస్తే? తమకు పదవులు వస్తాయని తెలిసి కూడా ఇగోకి పోతూ? ఉన్న అవాకాశాలను కూడా ఉపయోగించుకోవడం లేదని అంటున్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా? కమలంలోని పెద్దలు అక్కడ వాలిపోతారు.గెలుపు కోసం విస్తృత ప్రచారం చేస్తారు. అక్కడి కేడర్‌లో భరోసా నింపే ప్రయత్నం చేస్తారు. ఆ రూపంలో పార్టీకి ఊపు వస్తుంది.

2వ పేజీలో...



పవన్ ఖేరాకు సుప్రీంలో

## ఊరట

### షరతులతో కూడిన బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ, మే1 : కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరాకు భారీ ఊరట లభించింది. అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ భార్యపై వ్యాఖ్యల కేసులో సుప్రీంకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ జారీ చేసింది. ఈ క్రమంలో ఖేరాకు న్యాయస్థానం కొన్ని షరతులు విధించింది. అస్సాం సీఎం సతీమణి రిణికి భూయాన్ శర్మకు పలు పాస్‌పోర్టులు, విదేశాల్లో ఆస్తులు ఉన్నాయంటూ ఖేరా చేసిన ఆరోపణలపై ఆమె ఫిర్యాదు మేరకు గువాహటిలో ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం పవన్ ఖేరా చేసిన అభ్యర్థనను గువాహటి హైకోర్టు తిరస్కరించడంతో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

# తెలంగాణ డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్



మొదటిపేజీ తరువాయి...

ఆనంద్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చివరి దశకు చేరుకుందని సీవీ ఆనంద్ అన్నారు. "ఈ కేసును ప్రస్తుతం సిట్ విచారిస్తోంది. గతంలో హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడే.. ఈ కేసు గురించి నాకు తెలుసు. త్వరలో ఈ కేసును సమీక్షించి తుది ఛార్జిషీట్ ఫైల్ చేస్తాం" అని ఆయన పేర్కొన్నారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్.. 2013 నుంచి 2016 వరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ విధులు నిర్వర్తించారు. 2017లో అదనపు డీజీపీగా పదోన్నతి పొందారు. 2021 డిసెంబర్ 24న హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమితులైన ఆయన.. 2023 ఆగస్టు 7న డీజీగా పదోన్నతి పొందారు. 2024 సెప్టెంబర్ 7న రెండోసారి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2025 సెప్టెంబర్ 27 నుంచి హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆయన 2028జూన్ వరకు డీజీపీగా కొనసాగనున్నారు.

ఇది పోలీసులకు సవాలుగా మారింది. ఎన్ని కేసులు పెట్టినా.. డ్రగ్స్ ముఠాలు కూడా విస్తరిస్తున్నాయి. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ పోలీసుబృందం బాగా కృషి చేస్తోంది. శాంతిభద్రతల సమస్య రాకముందే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది" అని సీవీ

# భగ్గుమన్న కమర్షియల్ సిలిండర్

**19 కిలోల సిలిండర్‌పై రూ.993 పెంపు**

**హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై తీవ్ర భారం**



న్యూఢిల్లీ,మే1 : పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాల ప్రభావం భారత్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. ఇందనం సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చమురు నౌకలను దిగ్బంధించారు. ఈ క్రమంలో కొరత అనివార్యంగా మారింది. ఈ క్రమంలో ముఖ్యంగా వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే 19 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు వంటి వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.993 పెంచింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ రేటు రూ.3,315కు చేరింది. ఢిల్లీలో 19 కిలోల సిలిండర్ ధర రూ.3,071కి చేరుకుంది. ఢిల్లీలో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర గతంలో రూ. 2,078.50 ఉండేది. అదేవిధంగా, ముంబైలో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.2,031 నుంచి రూ. 3,024కు పెరిగింది. ఇక 5 కిలోల సిలిండర్ ధర రూ.914.50కి పెరిగింది. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలను మూడుసార్లు పెంచింది కేంద్రం. మొదట మార్చిలో రూ.144 పెరగగా, ఏప్రిల్ 1న దాదాపు రూ.200 మేర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు పెరగడం, సరఫరా ఇబ్బందులు, పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ పరిస్థితులు వంటి అంశాలు ఈ పెంపునకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెరిగినా.. గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

దీంతో సాధారణ ప్రజలకు కొంత ఊరట లభించింది. గృహ వినియోగ సిలిండర్ ధరలను స్థిరంగా ఉంచడం ద్వారా ప్రజలపై ఆర్థిక భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇదిలా ఉండగా.. పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు కూడా యథాతథంగా ఉన్నాయి. మరోవైపు, విమానయాన రంగానికి పెద్ద ఊరటనిస్తూ దేశీయ విమానయాన సంస్థలకు ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరల్లోనూ కేంద్రం ఎలాంటి మార్పులు చేయలేదు.

# నోబెల్ శాంతి బహుమతి రేసులో ట్రంప్..



మొదటిపేజీ తరువాయి...

"ప్రతి ఏటా నామినేషన్ల జాబితాలో ఎంతో మార్పు ఉండటం నన్ను ఆశ్చర్యపరిచింది" అని ఆయన ఒక ఇంటర్వ్యూలో అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఘర్షణలు, అంతర్జాతీయ సహకారంపై ఒత్తిడి ఉన్నప్పటికీ, నోబెల్ శాంతి బహుమతి ప్రాముఖ్యత మరింత పెరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. "మనం జీవిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో శాంతి బహుమతి పాత్ర ఎంతో కీలకం. గతంలో కంటే ఇప్పుడు మరింత మంచి పనులు జరుగుతున్నాయి" అని ఆయన వివరించారు. డొనాల్డ్ ట్రంప్ పేరు నామినేషన్లలో ఉండే అవకాశం ఉందని హార్ప్‌వికెన్ చెప్పినప్పటికీ, ఆయన పేరును అధికారికంగా ధ్రువీకరించలేదు. నిబంధనల ప్రకారం నామినేషన్ల జాబితాను 50 ఏళ్ల పాటు అత్యంత రహస్యంగా ఉంచుతారు. అయితే, కంబోడియా, ఇజ్రాయెల్, పాకిస్థాన్ దేశాధినేతలు ట్రంప్‌ను ఈ ఏడాది బహుమతికి నామినేట్ చేసినట్లు ఇప్పటికే ప్రకటించిన విషయాన్ని 'రాయిటర్స్' గుర్తుచేసింది. అయితే, కేవలం నామినేషన్ వచ్చినంత మాత్రాన అది నోబెల్ కమిటీ ఆమోదంగా భావించరాదని హార్ప్‌వికెన్ స్పష్టం చేశారు. నోబెల్ కమిటీ సభ్యులే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా వేలాది మందికి నామినేషన్లు ప్రతిపాదించే అవకాశం ఉంటుంది. పార్లమెంట్ సభ్యులు, దేశాధినేతలు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, మాజీ నోబెల్ గ్రహీతలు కూడా పేర్లను సూచించవచ్చు. రష్యా ప్రతిపక్ష నేత యూలియా నావల్నాయా, పోప్ లియో, సుడాన్ స్వచ్ఛంద సంస్థ 'ఎమర్జెన్సీ రెస్పాన్స్ రూమ్స్' వంటి పేర్లు కూడా బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌ల లో చర్చనీయాంశంగా ఉన్నాయి. 2026 నోబెల్ శాంతి బహుమతి విజేతను అక్టోబర్ 9న ప్రకటించి, డిసెంబర్ 10న అవార్డును ప్రదానం చేస్తారు. కాగా, వెనిజులాలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు కృషి చేసిన ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడోకు గత ఏడాది (2025) నోబెల్ శాంతి పురస్కారం లభించిన విషయం తెలిసిందే.

# కమలంలో ఆగని కుమ్ములాటలు

మొదటిపేజీ తరువాయి...

ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో జరుగుతోంది కూడా ఇదే. ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బెంగాల్‌లో గెలుపును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇంకా చెప్పాలంటే చెప్పులరిగేలా తీరుగుతున్నారని చెప్పుకోవచ్చు. బీజేపీకి చెందిన మిగతా అగ్ర నాయకులు కూడా అదే స్థాయి ఫోకస్ పెట్టారు. సరిగ్గా ఈ పాయింట్‌నే లేవనెత్తుతూ తెలంగాణ బీజేపీ నాయకులు వాళ్లని చూసి ఎప్పుడు నేర్చుకుంటారంటూ డిస్కస్ చేసుకుంటున్నారు కింది స్థాయిలో. బెంగాల్‌లో గెలిస్తే?పార్టీ ఖాతాలోకి మరో రాష్ట్రం వస్తుంది. అంతే తప్ప? నేషనల్ లీడర్స్ అందరికీ అక్కడేం పదవులు రావు, ప్రత్యేకంగా ఒరిగేదేం లేదు. అయినా సరే వాళ్ళంతా అంత కష్టపడుతుంటే? ఇక్కడ మాత్రం ముఖ్యమంత్రి పీఠం సహా? రకరకాల పదవులు రాష్ట్ర నేతలకే దక్కే అవకాశం ఉన్నా? ఎందుకు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారంటూ ఫైరైపోతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో పాగా వేయాలని పెద్దవాళ్ళు పడుతున్న తాపత్రయం? తిరుగుతున్న తీరు? తెలంగాణ నేతలకు కనిపించడం లేదా అన్న ప్రశ్న వస్తోంది కేడర్ నుంచి. వాళ్లని చూసైనా?. మా నాయకులు ఇగోలు పక్కన పెట్టాలని అంటున్నారు. పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తున్న నేషనల్ లీడర్స్‌కు, పార్టీ కన్నా మేమే గొప్ప అనుకుంటున్న స్టేట్ నాయకులకు చాలా తేడా ఉందని, ఆ సంగతి గమనించుకుని ఇకనైనా రాష్ట్ర పార్టీ నాయకులు మారితేనే తెలంగాణలో వాళ్ళకైనా, పార్టీకైనా భవిష్యత్ అన్నది కార్యకర్తల మాట. క్షేత్ర స్థాయిలో పని చేయడానికి మేం సిద్ధంగా ఉన్నా?నడిపించడానికి వాళ్లు రెడీగా లేరు, ఆ ఇగోలతో ఎన్నాళ్లని నడిపిస్తారని సొంతోళ్ళే మాట్లాడుకుంటున్నారు. మారండయ్యా?.. ఇకనైనా మారిపోండయ్యా?.. పై వాళ్ళని చూసి నేర్చుకోండయ్యా?.. అంటున్న తెలంగాణ బీజేపీ కార్యకర్తల మాటను రాష్ట్ర నాయకులు ఎంతవరకు పరిగణనలోకి తీసుకుంటారో చూడాలి.

# కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధిక పెద్దపీట



**జగన్ విధ్వంసంతో రాష్ట్రంలో అభివృద్ధి వెనుకంజ**

**రామచంద్రాపురంలో పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి అనిత**

అనకాపల్లి,మే1 : కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయని హోం మంత్రి అనిత వెల్లడించారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. గత ప్రభుత్వం దెబ్బతీసిన వ్యయస్థలను పునరుద్ధరించడంతో పాటు, చంద్రబాబు అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం పర్యటించారు. కోటవురట్ల మండలం రామచంద్రపురం గ్రామంలో హోం మంత్రికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. రామచంద్రపురం గ్రామంలో హోంమంత్రి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం రామచంద్రపురం గ్రామంలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కోటవురట్ల మండలం సుంకుపురు గ్రామంలో గంగమ్మ తల్లి పండగ సందర్భంగా అమ్మవారిని అనిత దర్శించుకున్నారు. ఆపై హోం మంత్రి మాట్లాడుతూ... అంకితభావం, కృషితో సమాజాన్ని ముందుకు నడిపిస్తున్న శ్రామిక సోదర సోదరీమణులందరికీ అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మికులు, కర్షకులే దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది అని అన్నారు. రెండోసారి పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా తనకు అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబు, నారా లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పోలిట్‌బ్యూరో సభ్యురాలిగా రెండవసారి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. రామచంద్రపురం గ్రామంలో కోటి 16 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. 2014 –19 సమయంలో పందూర్ బ్రిడ్జిని శంకుస్థాపన చేస్తే... మరలా ఎన్డీఏ ప్రభుత్వంలోనే బ్రిడ్జి పనులు పూర్తి చేశామని చెప్పారు. దేశంలోనే అత్యధికంగా పింఛన్లు ఇచ్చే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఔఖీఇఉ÷ూ రూ.40 కోట్లు, ఆర్ అండ్ బి నుంచి 40 కోట్ల రూపాయలతో వివిధ పనులు చేసినట్లు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పరిశ్రమల రాకతో పెద్ద సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు రానున్నాయన్నారు. స్టీల్ ప్లాంట్ రాకతో ఈ ప్రాంతం రూపు రేఖలు మారనున్నాయని, కోటవురట్ల మండలంలో కూడా పరిశ్రమలు తీసుకొస్తామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

## పెండింగ్ చలాన్లపై కోర్టు ధిక్కరణ

**పోలీస్ అధికారులకు హైకోర్టు నోటీసులు**

హైదరాబాద్,మే1 :ట్రాఫిక్ పెండింగ్ చలాన్ల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టుధిక్కరణ కింద డీజీపీ సీవీ ఆనంద్, మాజీ డీజీపీ శివధర్ రెడ్డి, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్‌కు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. పెండింగ్ చలాన్‌లు ఉంటే వాహనాలు సీజ్ చేయొద్దని ఈ ఏడాది జనవరి 20న హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఏప్రిల్ 9న మల్లికార్జున అనే వ్యక్తి బైక్‌ను పోలీసులు సీజ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించారని ఆరోపిస్తూ కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలైంది. హోంశాఖ సెక్రటరీ, డీజీపీ, ట్రాఫిక్ అదనపు సీపీ, రవాణా శాఖ కమిషనర్‌లను ప్రతివాదులుగా పిటిషనర్ చేర్చారు. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది విజయ్ గోపాల్.. హైకోర్టు ఉత్తర్వులను పోలీసులు అమలు చేయడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాహనం ఆర్సీ బుక్‌ను చూపించినా ట్రాఫిక్ పోలీసులు అంగీకరించడం లేదని న్యాయవాది తెలిపారు. ఈ క్రమంలో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెల 19కి హైకోర్టు వాయిదా వేసింది.

## కర్ణాటక ముఖ్యమంత్రి మార్పుపై స్పందించిన మల్లికార్జున ఖర్గే

మొదటిపేజీ తరువాయి...

కర్ణాటక కాంగ్రెస్ నాయకులు తనను, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసి తమ అభిప్రాయాలను పంచుకున్నారని తెలిపారు. లోక్ సభలో ఏఐసీసీ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు సరైన సమయంలో ఈ అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. మల్లికార్జున ఖర్గే ముఖ్యమంత్రి పదవి చేపడితే స్వాగతిస్తామని కర్ణాటక హోంమంత్రి జి. పరమేశ్వర అన్నారు. ఈ ప్రకటనపై కూడా ఖర్గే స్పందించారు. ముఖ్యమంత్రి కుర్చీ ఖాళీగా లేదని, కాబట్టి అలాంటి చర్చకు తావులేదని స్పష్టం చేశారు. తాను ముఖ్యమంత్రి కావాలని జి. పరమేశ్వరకు ఉండవచ్చు, మీరు (విలేకరులు) స్వాగతించవచ్చు, ఎవరైనా అంగీకరించవచ్చు కానీ ఈ విషయాలను నిర్ణయించేది సోనియా గాంధీ అని తెలిపారు.

## పెట్రో ధరలు పెంచడం లేదు

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వం ఇటీవల ఎక్సైజ్ సుంకంలో కొన్ని మార్పులు చేసినప్పటికీ, ఆ ప్రభావాన్ని వినియోగదారులకు బదిలీ చేయకూడదని ప్రభుత్వం, చమురు కంపెనీలు నిర్ణయించాయి. ఇంధన సరఫరా గొలుసులో స్థిరత్వాన్ని కాపాడతామని, పంపిణీలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ హామీ ఇచ్చింది. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న తరుణంలో, ఇంధన ధరలు పెరగకపోవడం అనేది రవాణా రంగంపై సానుకూల ప్రభావం చూపుతుంది. తద్వారా కూరగాయలు, ఇతర నిత్యావసరాల రవాణా ఖర్చులు పెరగకుండా ఉంటాయి. అంతర్జాతీయంగా ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు, కాల్పుల విరమణ వంటి పరిణామాల వల్ల చమురు మార్కెట్‌లో అనిశ్చితి నెలకొన్నప్పటికీ, దేశీయంగా ధరలను నియంత్రణలో ఉంచడం గమనార్హం.

# పాలమూరులో పలు రహదారులకు ప్రారంభోత్సవాలు



**వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోడీ**

**ప్రధాని పర్యటన వివరాలు వెల్లడించిన డికె అరుణ**

మహబూబ్‌నగర్,మే1 : నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత తెలంగాణకు తొలిసారి వస్తున్నారని బీజేపీ ఎంపీ డీకే అరుణ తెలిపారు. పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమ్మక్క, సారక్క గిరిజన విశ్వవిద్యాలయం పనులను కూడా ప్రారంభిస్తారని ఎంపీ తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా పాలమూరు జిల్లాలో పలు జాతీయ రహదారుల పనులనూ ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని ఎంపీ అరుణ వెల్లడించారు.మే 10వ తేదీన హైదరాబాద్‌కు ప్రధాని రానున్నట్లు వెల్లడించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొంటారని ఎంపీ అరుణ వెల్లడించారు. ఈ సభకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాయని ఎంపీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆమె ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని.. తెలంగాణలో ప్రధాని మోదీ తాజా పర్యటన అందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపైనా ఎంపీ స్పందించారు. ఐదు రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని అరుణ ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ఎంపీ అరుణ ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆమె ఆగ్రహించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండి కూటమి పార్టీలు వ్యతిరేకించి ద్రోహం చేశాయన్నారు. మరోవైపు వచ్చే ఎన్నికల్లో కల్వకుంట్ల కవిత పార్టీకి ఉనికి ఉండదన్నారు. గతంలో వైఎస్ షర్మిల పార్టీ పెట్టి వేరే పార్టీలో ఎలా విలీనం చేశారో.. కవిత పరిస్థితి అలాగే ఉంటుందన్నారు. తండ్రి పేరుతో రాజకీయ లబ్ది పొందాలని కవిత చూస్తున్నారని ఎంపీ డీకే అరుణ ఆరోపించారు.

## అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు

మొదటిపేజీ తరువాయి...

అసంఘటిత రంగంలో పనిచేస్తున్న గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్లాట్ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్స్ చట్టం, వారికి రూ. 5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామని తెలిపారు.

రాష్ట్రంలో ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికులకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5 వేలు చొప్పున బోనస్ ఇచ్చినట్టు గుర్తు చేశారు. దాంతోపాటు, పలు బ్యాంకుల సహకారంతో కార్మికులకు కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్టు వివరించారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా, వారి కుటుంబ సభ్యులకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించడం వంటి అనేక కార్మిక సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు.

## గ్యాస్ ధరల పెంపు సామాన్యుడిపై భారం

మొదటిపేజీ తరువాయి...

ఒక్కసారిగా 30 నుంచి 35 శాతం పెంచడంతో హోటళ్లు, రెస్టారెంట్లతో సహా చిన్నచిన్న వీధి వ్యాపారులపైనా తీవ్ర ప్రభావం పడనుందని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసి 24 గంటలు పూర్తి కాగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తీవ్ర విమర్శలు గుప్పించారు. కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో సామాన్యుల జీవన ప్రమాణాలపై కోలుకోలేని దెబ్బ పడిందని మంత్రి ఆరోపించారు. మోదీ ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కాగా, కమర్షియల్ గ్యాస్ ధరను పెంచుతూ మోదీ సర్కార్ ఈరోజు ఉదయం ఉత్తర్వులు జారీ చేసింది. 19 కేజీల సిలిండర్‌పై ఏకంగా రూ.993 పెంచింది. దీంతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో 19 కేజీల సిలిండర్ ధర రూ.3071.50కి చేరింది. కేంద్రం నిర్ణయంపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ ప్రభుత్వం యథావిధిగా ధరలు పెంచేసిందని ఆగ్రహిస్తున్నాయి. సామాన్యుడి నడ్డి విరిచేలా తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

## పవన్ ఖేరాకు సుప్రీంలో ఊరట

మొదటిపేజీ తరువాయి...

దీనిపై జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ జరిపి తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరుచేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా విచారణకు సహకరించాలని, పిలిచినప్పుడు పోలీసుల ముందు హాజరుకావాలని పవన్‌ఖేరాను న్యాయస్థానం ఆదేశించింది. సాక్ష్యాలు తారుమారు చేయడం వంటి చర్యలకు పాల్పడకూడదని పేర్కొంది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని కూడా స్పష్టం చేసింది. ఇక, విచారణ సమయంలో అవసరమని భావిస్తే.. అదనపు షరతులు విధించే స్వేచ్ఛ ట్రయల్ కోర్టుకు ఉందని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది.

# సంపాదకీయం

## శ్రమదోపిడీని ప్రోత్సహిస్తున్న పాలకులు !

శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదని మహాకవి శ్రీశ్రీ అన్నారు. కార్మిక లోకాన్ని తట్టి లేపిన విప్లవకారుడు శ్రీశ్రీ. అయితే దేశంలో ఐటి విప్లవం వచ్చిన తరవాత పాలకులు కార్మికులను పట్టించుకోవడం మానేశారు. నేటికీ వారి బతుకులు ఛిద్రం అవుతున్నా కనీసం పలకరింపులు, సానుభూతి వచనాలు లేవు. ఇప్పుడు కార్మికులంటే కేవలం కర్మాగారాల్లో పనిచేస్తున్నవారే కాదు. రోడ్డుమీద పడి పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ కార్మికులే. వారికి ముఖ్యంగా ఆరోగ్య, ఆర్థిక భద్రత లేదు. ఆకాశ హర్మ్యాలను కడుతున్నా.. కుటుంబానికి దూరంగా ఊడిగం చేస్తున్నా కూలీ తప్ప పెద్దగా ప్రయోజనాలు కలగడం లేదు. వీరందరికీ ప్రధానంగా ఆరోగ్య వసతి, పెన్షన్ పథకాలు కలగాలి. పనిచేసే ప్రతి ఒక్కరినీ కార్మికులుగా చూడాలి. వారికి విద్య,ఆరోగ్య, పెన్షన్ భద్రత వంటి కనీస సౌకర్యాలు కలగాలి. అలాగే అసంఘటిత కార్మికులను ఆదుకునే ప్రయత్నాలు చేయాలి. పాలకులంతా ఎసి కార్లలో, విమానాల్లో తిరుగుతూ.. ఎసి బంగలాల్లో నివస్తున్నారు. వీరికి సామాన్యుల కష్టాలు తెలియడం లేదు. ప్రజలు కట్టిన పన్నులతో జల్సాలు చేస్తున్నారు. సమాజ గతిని, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమే. ఆ శ్రమే వెట్టిచాకిరికి గురవుతోంది. శ్రామికుడు దోపిడీకి గురవుఉతన్నాడు. పరిస్థితులు ఇలాగే ఉంటే.. కష్టించి పని చేసే చేతులు పిడికిళు బిగిస్తాయని గుర్తించాలి. ఉద్యమాలు పుట్టుకొస్తాయి. కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మే డే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది. భారతదేశంలో చాలా ఆలస్యంగా కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నాము. 1923 మే 1వ తేదీన మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో తొలిసారి ఈ వేడుకలను జరుపుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఐరోపా దేశాల్లో మే 1వ తేదీని సెలవు దినంగా పాటించడం మొదలు పెట్టారు. అనంతరం అనేక దేశాలు ఇదే బాటలో నడిచాయి. చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు ఆ రోజునే అమల్లోకి వచ్చాయి. కార్మిక దినోత్సవం సందర్భంగా చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించి అనేక సంక్షేమ పథకాలు పుట్టుకొచ్చాయి. అలాగే సంక్షేమ పథకాల అమలుకు, నిరసన ప్రదర్శనలకు మే 1వ తేదీ వేదికగా మారింది. ముఖ్యంగా మేడే రోజున కార్మికులు వారి హక్కులను గుర్తు చేసుకోవడం, సమాజానికి వారు చేసిన సేవలకు గాను తగిన గుర్తింపు ఇచ్చి వారిని సన్మానించడం చేస్తున్నాం. 1916లో తొలిసారిగా రోజుకు 8 పని గంటలు మాత్రమే అన్న డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మనదేశంలో ఇతర దేశాల కంటే ముందే కలకత్తాలో కార్మికుల పనిగంటల కోసం హౌరా రైల్వే స్టేషన్లో 1862లోనే సమ్మె చేశారు. 1923లో తొలిసారిగా భారత్ దేశంలో మే డే ను పాటించారు. ఆ తర్వాత 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడడంతో అప్పటి నుంచి కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. దీంతో మే డే పాటిస్తున్నారు. కానీ అసంఘటిత కార్మిక వర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. మనదేశంలో అసంఘటిత రంగం పూర్తిగా నిరాదరణకు గురవుతోంది. నిర్మాణ, వ్యవసాయ, గిర కార్మిక రంగాలు పూర్తిగా వెలివేయ వద్దాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటారు. సామాజిక న్యాయం, అందరికీ గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడానికి పాలకులు ముందుకు రావాలి. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయి స్తున్నారు. ఐటి రంగంలో పనిచేస్తున్న విద్యావంతులైన యువత శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఇప్పుడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలిస్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలు కావడం లేదు. అందుకే అనేక సంస్థల్లో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికమైనారు. అంతేకాకుండా ప్రభుత్వరంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోయింది. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. అందుకే ప్రైవేట్ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ వలన వంద సంవత్సరాల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా ఈనాడు అమలుకు నోచుకోవడంలేదు. ఎనిమిది గంటల పనికోసం చేసిన పోరాటం పెట్టుబడిదారీ వర్గం పతనానికి ఆరంభమవుతుందనుకున్నాం. కానీ మళ్ళీ మార్కెట్ శక్తులు పాత పరిస్థితులకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నాయి. ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరుస్తుందని, ఈ మే డే నాడు కొత్త స్ఫూర్తిని రగిలిస్తుందని ఆశిద్దాం. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైనవి శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.

## పంటల మార్పిడి తప్పకుండా చేయాలి : సి. హెచ్.పల్లవి



రాయపోల్: పంటల మార్పిడి తప్పకుండా చేయాలి. యూరియా వాడకాన్ని తగ్గించాలి అని డా. సి. హెచ్.పల్లవి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అధ్వర్యంలో మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు, వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలోని రైతువేదికలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సిద్ధిపేట, వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నల వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సోదరులకు ఆరు అంశాలపై అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా వాడకాన్ని తగ్గించడం ద్వారా సాగు ఖర్చు తగ్గించు కోవచ్చునని, రసాయనాలను అవసరం మేరకు వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడడం, పంట మార్పిడి పాటించడం ద్వారా స్థిర ఆదాయం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డా. డి.శ్వేత, నరేష్, హార్టికల్చర్ ఆఫీసర్ రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారిని రజిత, స్వర్ణలత, ప్రవీణ్, సర్పంచ్ మాసంపల్లి రాజు, దిశా కమిటీ సభ్యుడు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఒకే కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ములు మృతి..

### శోకసంద్రంలో కోయిల్ దిన్నే గ్రామం!



అలంపూర్: జోగులాంబ గద్వాల జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. పశుగ్రాసం కోసం వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు మృతి చెందారు. దీంతో వడ్డేపల్లి మండలం కోయిల్ దిన్నే గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. డీసీఎం వాహనం రూపంలో వచ్చిన మృత్యువు ఆ నిరుపేద రైతు కుటుంబాన్ని రోడ్డున పడేసింది. వివరాల్లోకి వెళితే.. కోయిల్ దిన్నే గ్రామానికి చెందిన రైతులు వి.కృష్ణారెడ్డి, వి.తిక్కారెడ్డి, వి.చంద్రమోహన్ రెడ్డి ముగ్గురు అన్నదమ్ములు. తమ పశువులకు కోసం వనపర్తి జిల్లా పెబ్బేరు నుండి గడ్డిని ట్రాక్టర్‌లో తీసుకువస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటన ఏప్రిల్ 27న ఎర్రవల్లి చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై బెటాలియన్ పెట్రోల్ బంక్ వద్ద వీరు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను ఒక డీసీఎం వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన కృష్ణారెడ్డి, తిక్కారెడ్డి అదే రోజు కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ప్రాణాపాయ స్థితిలో హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మూడవ సోదరుడు చంద్రమోహన్ రెడ్డి కూడా ఈరోజు మృతి చెందాడు. ఒకే కుటుంబంలో ముగ్గురిని కోల్పోవడంతో ఆ కుటుంబాలు అనాథలయ్యాయి. చేతికొచ్చిన ముగ్గురు అన్నదమ్ములు నూరేళ్లు నిండకుండానే తనువు చాలించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బొలెరో బోల్తా.. మంటలు అంటుకొని దగ్ధం



కొత్తగూడ : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గువ్వలబోడు సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నర్సంపేట నుంచిగంగారం వైపు బార్దాన్ (గన్నీబ్యాగులు) లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తాపడి పూర్తిగాదగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సంపేట నుంచి గంగారం వైపు వెళ్తున్న మొక్క జొన్నకు ఉపయోగించే గన్నీ బ్యాగులు తీసుకెళ్తున్న బొలెరో వాహనం చిలకమ్మ నగర్ పరిసరాల్లోకి రాగానే రోడ్డు పక్కన మండు తున్న అడవి ఎర్రగడ్డి మంటలు వాహనం పై ఉన్న బార్దాన్ పై పడి అంటు కున్నట్లు సమాచారం. వాహనం వేగంగా ప్రయాణిస్తుండటంతో మంటలు మరింత వేగంగా వ్యాపించాయి. గేదవాగు సమీపానికి చేరుకునేసరికి డ్రైవర్ అద్దంలో చూసి మంటలను గమనించాడు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కకు మళ్లించే ప్రయత్నం చేయగా.. అదే సమయంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడి మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. క్షణాల్లోనే వాహనం పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుధాకర్ తీవ్రంగా గాయపడగా.. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది గాయపడిన డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు.

# దూసుకెళ్తున్న యూపీఐ..

# మరో మైలురాయి దాటిన డిజిటల్ పేమెంట్లు




- ఏప్రిల్‌లోనూ కొనసాగిన డిజిటల్ చెల్లింపుల వృద్ధి
- 22.35 బిలియన్ల లావాదేవీలతో రూ.29.03 లక్షల కోట్ల వ్యాపారం
- పదేళ్లలో 12,000 రెట్లు పెరిగిన యూపీఐ లావాదేవీల సంఖ్య
- ఎనిమిదికి పైగా దేశాలకు విస్తరించిన యూపీఐ సేవలు

ఢిల్లీ,:భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ తన అప్రతిహత జైత్రయాత్రను కొనసాగిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో లావాదేవీల సంఖ్య, విలువ పరంగా గణనీయమైన వృద్ధి నమోదైంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఏప్రిల్‌లో దేశవ్యాప్తంగా 22.35 బిలియన్ల డిజిటల్ లావాదేవీలు జరిగాయి. వీటి మొత్తం విలువ రూ.29.03 లక్షల కోట్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే లావాదేవీల సంఖ్యలో 25%, విలువలో 21% వృద్ధి కనిపించింది.

రోజువారీ లావాదేవీల పరంగా కూడా ఈ వృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. మార్చిలో రోజుకు సగటున 730 మిలియన్ల లావాదేవీలు జరగగా, ఏప్రిల్‌లో ఈ సంఖ్య 745 మిలియన్లకు పెరిగింది. అలాగే, రోజువారీ లావాదేవీల సగటు విలువ రూ.95,243 కోట్ల నుంచి రూ.96,766 కోట్లకు చేరింది. ఇదే నెలలో ఐఎంపీఎస్ ద్వారా 362 మిలియన్ల లావాదేవీలు జరగ్గా, వాటి విలువ రూ.7.01 లక్షల కోట్లుగా నమోదైంది.

భారత్ గర్వించదగ్గ యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) సేవలు కేవలం దేశానికే పరిమితం కాలేదు. ఇప్పటికే యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్, శ్రీలంక, మారిషస్ సహా 8కి పైగా దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ అంతర్జాతీయ విస్తరణ ద్వారా విదేశాల నుంచి డబ్బు పంపడం సులభతరం అవ్వడమే కాకుండా, ప్రపంచ ఫిన్‌టెక్ రంగంలో భారత్ స్థానం మరింత పటిష్ఠమవుతోంది.

యూపీఐకి ఐఎంఎఫ్ గుర్తింపు: కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకారం గత దశాబ్ద కాలంలో యూపీఐ లావాదేవీల సంఖ్యలో దాదాపు 12,000 రెట్ల వృద్ధి నమోదైంది. 2016–17 ఆర్థిక సంవత్సరంలో కేవలం 2 కోట్ల లావాదేవీలు జరగ్గా, 2025–26 నాటికి ఆ సంఖ్య 24,162 కోట్లకు చేరింది. ఇదే సమయంలో లావాదేవీల విలువ రూ.0.07 లక్షల కోట్ల నుంచి రూ.314 లక్షల కోట్లకు పెరిగి, 4,000 రెట్ల వృద్ధిని నమోదు చేసింది. యూపీఐ పనితీరు, విశ్వసనీయత కారణంగా భారత్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచింది. లావాదేవీల సంఖ్య పరంగా యూపీఐ ప్రపంచంలోనే అతిపెద్ద రియల్–టైమ్ పేమెంట్ సిస్టమ్ అని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సైతం గుర్తించింది.

## ఏటూరునాగరం గ్రామ పంచాయతీకి ఫ్రీజర్ బాక్స్ బహుకరణ




ఏటూరునాగరం (తెలంగాణ వాణి) ప్రజాసేవలో నిరంతరం ముందుండే ఏటూరునాగరం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, కాకులమర్రి ప్రదీప్ రావు మరోసారి తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. వారి తాత దివంగత కాకులమర్రి రాఘవరావు జ్ఞాపకార్థం తమ సొంత నిధులతో కొనుగోలు చేసిన డెడ్ బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను గ్రామ పంచాయతీకి బహుకరణగా అందజేశారు. ఏటూరునాగరం పరిసర ప్రాంతాల్లో ఎవరైనా మరణించినప్పుడు, మృతదేహాన్ని భద్రపరచుకోవడానికి ఫ్రీజర్ బాక్స్ కోసం మంగపేట వంటి సుదూర ప్రాంతాల నుండి తెచ్చుకోవాల్సి వచ్చేది. వేరే ప్రాంతాల నుండి తెచ్చుకోవడంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను, ఆలస్యాన్ని చూసి చలించిపోయిన సర్పంచ్ కుటుంబం, స్థానికంగానే ఈ సదుపాయం ఉండాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా, తమ సొంత నిధులను వెచ్చించి ఈ ఫ్రీజర్ బాక్స్‌ను కొనుగోలు చేసి పంచాయతీకి అప్పగించారు. దీనివల్ల నిరుపేదలకు, మారుమూల గ్రామ ప్రజలకు ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, సమయం కూడా ఆదా అవుతుంది. ఈ సందర్భంలో సర్పంచ్ శ్రీలత మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి ఈ చిన్న సహాయం చేయడం తమ కుటుంబానికి ఎంతో తృప్తినిచ్చిందని తెలిపారు. తమ కుటుంబ పెద్దల స్మారకార్థం ప్రజలకు ఉపయోగపడేలా ఈ బహుకరణ చేయడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

### నూతన కార్యవర్గం ఎన్నిక



జగిత్యాల (తెలంగాణ వాణి ప్రతినిధి): జిల్లా ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని నూతన కార్యవర్గాన్ని ఎన్నిక చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ వైద్యుల సంఘానికి సంబంధించిన కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా వైద్యురాలు అరుణ వ్యవహరించారు. అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగగా వైద్యులు అమరేశ్వర్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వైద్యులు ముస్కు జైపాల్ రెడ్డి, కోశాధికారిగా గొడికే నవీన్ లతో పాటు పూర్తి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం వైద్యుల సేవా సమస్యలు, సిబ్బంది కొరత, పని ఒత్తిడి, మౌలిక సదుపాయాల లోపం, భద్రతా అంశాలు, ప్రమోషన్లు, వేతనాలకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు కృషి చేయనున్నట్లు వెల్లడించింది. సమావేశంలో పలువురు వైద్యులు మాట్లాడుతూ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వైద్య సేవల మెరుగుదల కోసం వైద్యుల సమస్యల పరిష్కారం కీలకమని అభిప్రాయ పడ్డారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్యుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సమిష్టిగా పని చేస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో వైద్య రంగానికి సంబంధించిన సమస్యలపై అధికారులతో చర్చలు జరిపి పరిష్కార మార్గాలు అన్వేషించనున్నట్లు వెల్లడించారు.

## 'హింస నిరోధంలో స్థానిక నాయకత్వం పాత్ర కీలకం'

### ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ శివనాదుల శ్రీనివాస్




ఖమ్మం రూరల్, మే 01 : హింస నిరోధంలో స్థానిక నాయకత్వం పాత్ర చాలా కీలకమని ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ శివనాదుల శ్రీనివాస్ అన్నారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచనల మేరకు ప్రజా పాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఖమ్మం రూరల్ మండల పరిషత్ కార్యాలయం నందు సర్పంచులు, ఉప సర్పంచులు, స్థానిక నాయకులకు "సామాజిక నాయకత్వం, స్థానిక ప్రభావశీలు హింస నిరోధంలో నాయకుల పాత్ర " అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో హింస అనేది అందరి జీవితాలను దెబ్బ తీస్తోందన్నారు. సమాజాన్ని మార్చడానికి, సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. గ్రామాలలో, కాలనీలలో హింస నిరోధానికి స్థానిక న్యాయకత్వం ముందంజలో నిలబడాలన్నారు. వారు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి మహిళలు, పిల్లల హక్కుల గురించి చెప్పాలన్నారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, బానిసత్వ కార్మికుల సమస్యలపై ఎన్‌జీఓలు, స్థానికులు కలిసి పోరాడాలని, గ్రామ ప్రథమ పౌరులుగా హింసను తిరస్కరించి ముందుకు సాగాలన్నారు. సమాజంలో ఐక్యత సృష్టించాలి – గ్రామ సభలు, సమావేశాలలో చర్చలు నిర్వహించి తెలియజేయాలి. డయల్ 100, సైబర్ నేరాల కోసం 1930 లాంటి సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ఐ జ్యోతి, ఏ హెచ్ టి యు – భాస్కర్, ఎయిడ్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ కానిస్టేబుల్ రుక్మిణి, మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

### దుకాణాల అద్దాలు పగలకొట్టే ఆకతాయిలు అరెస్టు

హైదరాబాద్: స్లింగ్ షాట్తో షాపుల గాజులు ధ్వంసం చేసిన సీరియల్ నిందితులు అరెస్ట్; 11 కేసులు ఛేదించిన ఐఎస్ సదన్ పోలీసులు 30-04-2026న ఐఎస్ సదన్ పోలీసులు వరుసగా షాపుల గాజులను ధ్వంసం చేస్తూ ప్రజలకు ప్రమాదం కలిగించే చర్యలకు పాల్పడిన (4) మంది నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులు గులెల్ మరియు గోటి సహాయంతో వివిధ పోలీస్ స్టేషన్ పరిధుల్లో షాపుల గాజులను పగులగొట్టి వినోదం పొందుతూ ఈ నేరాలకు పాల్పడ్డారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలు సంతోష్నగర్, సైదాబాద్, చాదర్ఘాట్, మలక్పేట్, చంద్రాయణగుట్ట, సరోర్నగర్ మరియు ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధుల్లో చోటుచేసుకున్నాయి. మొత్తం 11 కేసులు ఛేదించబడినవి. అరెస్ట్ చేసిన నిందితుల వద్ద నుండి ఒక క్వాలిస్ వాహనం, రెండు మొబైల్ ఫోన్లు, గులెల్ (స్లింగ్ షాట్) మరియు గాజు బంతులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు చార్మినార్ జోన్ డీసీపీ శ్రీ కిరణ్ ఖరే, ఏసీపీ సంతోష్నగర్ డివిజన్ టి. సుఖ్దేవ్ సింగ్ మరియు ఇన్స్పెక్టర్ జి. నాగరాజు పర్యవేక్షణలో, ఎస్ఐ శ్రీ కె. మహేష్ దర్యాప్తులో ఐఎస్ సదన్ పోలీస్ బృందం విజయవంతంగా ఛేదించింది.

## గ్యాస్ ఫిల్లింగ్ చేస్తుండగా ఆటోలో మంటలు



హిమాయత్‌నగర్: నారాయణగూడ మెట్రో స్టేషన్ సమీపంలోని మార్వెల్ ఫంక్షన్ హాల్ పక్కన ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకులో గురువారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా ఆటోలో మంటలు చెలరేగడంతో ఒక ఆటో పూర్తిగా దగ్ధమైపోగా, మరో ఆటో పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. 3146 నంబర్ గల ఆటోకు గ్యాస్ నింపుతున్న సమయంలో అకస్మాత్తుగా మంటలు ఎగసిపడ్డాయి. వెంటనే మంటలు పక్కనే ఉన్న మరో ఆటోకు వ్యాపించాయి. అప్రమత్తమైన ఆటో డ్రైవర్ దేవరకొండ మండలం ముదిగొండ జర్పుల తండాకు చెందిన జర్పుల చిన్న సోముల (45) సురక్షితంగా బయటపడ్డాడు. ఈ ప్రమాదంలో గ్యాస్ ఫిల్లింగ్ నిర్వహిస్తున్న బండ్లగూడకు చెందిన ఎండీ సిరాజ్ (34)తో పాటు మరో వ్యక్తి రాజ్‌కుమార్ గాయపడ్డారు. వారిని వెంటనే చికిత్స నిమిత్తం కింగ్‌కోటి ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో పెట్రోల్ బంక్ వద్ద పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పైలట్లకు విశ్రాంతిపై నిబంధనలు బేఖాతరు

### ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆందోళన



న్యూఢిల్లీ, మే1 : పైలట్లకు తప్పనిసరిగా విశ్రాంతి కల్పించేందుకు రూపొందించిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ నిబంధనలు అమల్లోకి రాకపోవడంపై ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తంచేసింది. విమాన ప్రయాణంలో పైలట్లు అనారోగ్యానికి గురవడం, మరణించడం వంటి విషయాలపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కు లేఖ రాసింది. ఇటీవల విధుల్లో ఉండగానే పలువురు పైలట్లు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో విమాన భద్రత, నియంత్రణ, విమాన సిబ్బంది శ్రేయస్సు వంటి విషయాల్లో ఆందోళన వ్యక్తంచేసింది. గతంలో పలు విజ్ఞప్తులు చేసినప్పటికీ.. పైలట్లకు తప్పనిసరిగా విశ్రాంతి కల్పించే నిబంధనలను నిరంతరం వాయిదా వేయడం వల్లే ఈ సమస్యలు తలెత్తుతున్నాయని పైలట్స్ అసోసియేషన్ పేర్కొంది. విమానయాన సంస్థలకు నిరంతరం మినహాయింపు లను మంజూరుచేస్తుండడం ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను నీరుగార్చిందని తెలిపింది. తాత్కాలిక చర్యలుగా ప్రవేశపెట్టిన ఈ సడలింపుల వల్ల పైలట్లకు విశ్రాంతి ఉండట్లేదని పేర్కొంది. దీనివల్ల వారు మానసికంగా, శారీరకంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వెల్లడించింది. ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను వెంటనే అమలుచేయడానికి మార్గదర్శకాలు రూపొందించాలని డీజీసీఏను కోరింది.

## ఎల్‌నినో హెచ్చరిక



ఈ ఏడాది వేసవి ఎండలు ఏప్రిల్‌లోనే ఠారెత్తించడానికి వాతావరణ మార్పులే హేతువుగా ప్రపంచ స్థాయి అధ్యయన సంస్థలు కుండబద్దలు కొడుతున్నాయి. ఈ వారం చివరిలో ప్రపంచంలో అధిక వేడిమి నమోదైన 20 పెద్ద నగరాల్లో 19 మన దేశంలోనే ఉండటం ద్వారా వాతావరణ మార్పులు ఇక్కడ ఎక్కువ ప్రభావంలచూపుతున్నట్లు అర్థమవుతుంది. ఈశాన్య, పశ్చిమ హిమాలయ ప్రాంతంలో మినహా తతిమ్మా దేశం మొత్తం 40- 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేడిమి, వడగాలులు, ఉక్కపోతలతో ప్రజలు కుతకుత ఉడికిపోతున్నారు. తూర్పు, మధ్య పసిఫిక్ సముద్ర ఉపరితలం వేడెక్కి ఎల్‌నినో ఏర్పడుతున్నట్లు వాతావరణసంస్థలు ముందు నుంచే హెచ్చరించాయి. ఏప్రిల్- జూలై మధ్య ఎల్‌నినో ఏర్పడి అక్టోబర్-ఫిబ్రవరి మధ్య బలపడనుంది. ఇంటర్నేషనల్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ క్లైయిమెట్ అండ్ సొసైటీ ప్రకారం సంవత్సరం మధ్యలో ఎల్‌నినో ఏర్పడటానికి 70 శాతం అవకాశం ఉంది. ఇది మిగిలిన సంవత్సరం మొత్తం కొనసాగుతుంది. ఈ అంచనా మేరకు ఏడాది మొత్తం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. 149 సంవత్సరాల క్రితం ఏర్పడ్డ మెగా ఎల్‌నినో ప్రపంచంలో 4 శాతం జనాభాను తుడిచిపెట్టినట్లు చరిత్ర చెబుతోంది.

వేడిమి కీలక ఆర్థిక రంగాలను దెబ్బతీస్తుందని గత అనుభవాలు తెలియజేస్తున్నాయి. ఐరాస ఆహార, వ్యవసాయ సంస్థ, ప్రపంచ వాతావరణ సంస్థ సంయుక్తంగా ప్రకటించిన అధ్యయనం ప్రకారం 2022లో నెలకొన్న తీవ్ర వేడిమితో దేశంలో ప్రధాన ఆహార పంట గోధుమ ఉత్పత్తి 9-34 శాతం తగ్గింది. ఆహారోత్పత్తులన్నింటిలోనూ ఇటువంటి ప్రభావమే కనిపించింది. ఇప్పటికి వెలువడిన వాతావరణ అంచనాలు వాస్తవరూపం దాలిస్తే, ముందు ముందు మరిన్ని సవాళ్లు ఎదురవుతాయి. రానున్న ఖరీఫ్, రబీలో సాధారణ స్థాయి కంటే తక్కువగా రుతుపవనాల ప్రభావం ఉంటుందన్న సంకేతాలు, పంటల సాగు, దిగుబడులపై ప్రతికూల ప్రభావం కలిగిస్తాయి. యుద్ధం పశ్చిమాసియాలో సంక్షోభాన్ని తెచ్చిపెట్టింది. చమురు, గ్యాస్ కొరత నానాటికీ తీవ్రమవుతోంది. ఈ పరిస్థితులు ఎరువుల ఉత్పత్తి, సరఫరాకు ఆటంకంగా ఉండబోతున్నాయి. ఎరువుల ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. మామూలు రోజుల్లోనే ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఎరువులకు కొరత ఏర్పడి రైతులు రోడ్డెక్కాల్సి వచ్చింది. ఎల్‌నినో, యుద్ధం సమస్యను ఇంకా తీవ్రం చేస్తాయనడానికి పెద్ద అధ్యయనాల అవసరం ఉండదు.

ఒక్క వ్యవసాయ రంగమే కాదు ఇంధన రంగాన్నీ సునిశితంగా పరిశీలించాల్సిన అగత్యం ఉంది. గత వారం దేశంలో విద్యుత్ డిమాండ్ 256.1 గిగావాట్ల గరిష్ట స్థాయికి చేరింది. 2022 కరోనా మహమ్మారి అనంతరం ఇంధన డిమాండ్, ఎల్‌నినో ప్రభావంతో తీవ్రమయ్యే గ్రీష్మ తాపంతో కలిపి బొగ్గు సంక్షోభాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నది నిపుణుల సూచన. వడ గాలులు ఆహార భద్రత, ఆరోగ్యం, ఇంధన రంగాలను దెబ్బతీసేంత శక్తివంతమైనవి. ఆ ప్రభావాలు కచ్చితంగా దేశ ఆర్థిక పురోగతిని తగ్గిస్తాయి. వికసిత భారత్ వెలుగులో రాబోయే ఐదేళ్లకూ దేశ ఆర్థిక వృద్ధి ఏడాదికి కనీసం పది శాతం ఉండాలని మోడీ ప్రభుత్వం ఊహలకు పోతుండగా, మామూలు పరిస్థితుల్లోనే అంత సీన్ లేదని, 6-7 శాతం లోపేనని పలు రేటింగ్ సంస్థలు పదే పదే నొక్కివక్కాణిస్తున్నాయి. ఎల్‌నినో, పశ్చిమాసియా ఉద్రిక్త పరిస్థితులు తోడైతే మన ఆర్థిక వృద్ధి ఇంకా తగ్గుతుంది. జిడిపి గణాంకాలను పక్కనపెట్టి మోడీ ప్రభుత్వం ఎల్‌నినో, యుద్ధం పరిస్థితులను ఎదుర్కోడానికి పక్కా కార్యాచరణతో ముందుకు రావాలి. ఆహార సరఫరాకు పటిష్ట ప్రణాళికలు రచించాలి. రాష్ట్రాలను ఆ దిశగా సన్నద్ధం కావించి అత్యవసరంగా నిధులివ్వాలి. రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం ఉంటుందని కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారే తప్ప, సన్నద్ధతపై అంతగా పట్టించుకోలేదని క్షేత్ర స్థాయి పరిస్థితులు తెలుపుతున్నాయి. కేంద్రంపై ఒత్తిడి చేసి తగిన నిధులు సాధించి ప్రజల బతుకులకు రక్షణ కల్పించి భరోసా నింపాలి.

## రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మాడు పగలగొడుతున్నాయి.. రాష్ట్రంలో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫిబ్రవరి నెల నుంచే ఎండల తీవ్రత కనిపించింది.. ముందు 35 డిగ్రీల నుంచి మొదలై 40 డిగ్రీల వరకు చేరింది. మార్చి నెల నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరిగాయి.. 42 డిగ్రీల నుంచి 45 వరకు ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతులు 45 డిగ్రీలు కూడా దాటి 46 డిగ్రీల వరకు నమోదవుతోంది. ఎండలకు తోడు వేడిగాలులు, ఉక్కపోతతో జనాలు అల్లాడిపోతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇవాళ అధిక ఉష్ణోగ్రతలతో పాటుగా 19 మండలాల్లో తీవ్రమైన వేడిగాలులు, 21 మండలాల్లో వేడిగాలులు వీచే అవకాశం ఉందన్నారు. విజయనగరం జిల్లాలోని బాడంగి, బొబ్బిలి, రామభద్రాపురం, తెర్లాం, వంగర మండలాల్లో.. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలోని బలిజిపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, మక్కువ, పాచిపెంట, పాలకొండ, పార్వతీపురం, సాలూరు, సీతానగరం, వీరఘట్టం మండలాల్లో తీవ్ర వేడిగాలుల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. మార్కాపురం జిల్లా కంభంలో 45.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డైంది. నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 45.1 డిగ్రీలు, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 44.8 డిగ్రీలు, అమరావతిలో 44.2 డిగ్రీలు, తిరుపతి జిల్లా బెస్తపల్లిలో 44.2 డిగ్రీలు, కడప జిల్లా వీరబల్లిలో 44.2 డిగ్రీలు, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మొత్తం 28 జిల్లాలకు గాను 20 జిల్లాల పరిధిలోని 227మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.ఏపీలో ఎండలు, వేడిగాలులు, ఉక్కపోత ప్రభావం కనిపిస్తోంది.. జనాలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు. ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అంటున్నారు. రాష్ట్రంలో మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు.

## ఈత రాకపోయినా నీటిలో దూకి..

### కూతుర్ని కాపాడి

## కన్నుమూసిన తల్లి



నాగర్‌కర్నూలు: కూతుర్ని కాపాడేందుకు ఓ తల్లి తన ప్రాణాలకు తెగించింది. ఈత నేర్చుకుంటున్న కూతురు మునిగిపోతుందని.. తనకు స్విమ్మింగ్ రాకపోయినా సరే కాపాడేందుకు నీటిలోకి దూకేసింది. అదే నీటిలో మునిగి మరణించింది. నాగర్‌కర్నూలు జిల్లాలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నాగర్‌కర్నూలు జిల్లా ఉప్పునుంతల మండలం వెల్టూరు గ్రామానికి చెందిన అనూష(35)కు ఇద్దరు పిల్లలు ధనలక్ష్మి(12), అక్షిత (10). భర్త ఐదేళ్ల కిందటే చనిపోవడంతో కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను అనూష పోషిస్తోంది. వేసవి సెలవులు కావడంతో వారిద్దరికీ నీటి గుంతలో ఈత నేర్పించేందుకు తీసుకెళ్లింది. చిన్న కూతురు అక్షిత నడుము కూల్ డ్రింక్ బాటిళ్లు కట్టి గుంతలోకి దింపింది. అయితే నీటిలోకి దిగిన తర్వాత అక్షిత ఏడవడంతో అనూష కంగారు పడిపోయింది. తన కూతురు నీటిలో మునిగిపోతుందేమో అన్న భయంతో గుంతలోకి దూకింది. కానీ అనూషకు కూడా ఈత రాకపోవడంతో అదే నీటి గుంతలో మునిగిపోయింది. దీంతో పెద్ద కూతురు ధనలక్ష్మి పరిగెత్తుకుంటూ వెళ్లి స్థానికంగా ఉన్న రైతులకు సమాచారం ఇచ్చింది. విషయం తెలియగానే హడావుడిగా వచ్చిన వారు.. కూల్ డ్రింక్ బాటిళ్లతో ఉన్న అక్షితను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఇక ఈత రాకపోవడంతో అనూష నీట మునిగి మరణించింది. తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయి ఇద్దరు పిల్లలు అనాథలుగా మారడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మారని తమ్ముళ్లు..

విజయవాడ : ఒకరి తర్వాత మరొకరు. ఒక ఇష్యూ తర్వాత మరో రచ్చ. ఎమ్మెల్యేలే కాంట్రవర్సీకి తెరలేపుతున్నారో..లేక వివాదాలే వాళ్లను వెతుక్కుంటూ వస్తున్నాయో తెలియదు కాని.. ప్రతి నెల రోజులకో ఎమ్మెల్యే తీరు ఇష్యూ అవుతోంది. టీడీపీ అధినేతకు హెడెక్ అవుతోంది. పర్సనల్ లైఫ్ వేరు. పబ్లిక్ లైఫ్ చాలా సున్నితమైంది. ప్రజా జీవితంలో ఉన్న నేతలు..వారి చుట్టున్న వాళ్లు చిన్న మిస్టేక్ చేసిన పెద్ద రచ్చ అవుతోంది. పొలిటికల్ లైఫే తలకిందులైన సందర్భాలు ఉన్నాయి. అందుకే చేసే ప్రతీ..మాట్లాడే ప్రతీ మాట ఎంతో ముఖ్యం. రాజకీయ నాయకులు అయితే ఎంత జాగ్రత్తగా ఉంటే అంత బెటర్. ఎంత ఆచితూచి వ్యవహరిస్తే అంత మంచిది. దూకుడే పేరు తెచ్చి పెట్టినా..ఆ దూకుడు స్వభావమే నట్టేట ముంచొచ్చు. సింపుల్ లివింగ్, లో ప్రొఫైల్..హై థింకింగ్‌కు అలవాటు పడిన వారికే బెటర్ పొలిటికల్ ఫ్యూచర్ ఉంటుందన్నది..సీనియర్ లీడర్లను చూస్తే అర్థమవుతోంది. ఎమ్మెల్యేలు సరిగ్గా ఉంటే సరిపోదు..వారి కుటుంబ సభ్యులు, అనుచరులు, సిబ్బంది అందరి ప్రవర్తన లెక్కలోకి వస్తుంది. చివరకు ఎమ్మెల్యేతో ఫోటో దిగిన వ్యక్తి ఏదైనా తప్పు చేసి దొరికినా..అది ఆ ప్రజాప్రతినిధి మెడకు చుట్టుకోవడం ..ఆయన సమాధానం చెప్పుకునే పరిస్థితులకు దారితీస్తుంది.ఏ పొలిటికల్ లీడర్ అయినా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే..తాము చేసే ప్రతి పనిని ప్రజలు గమనిస్తున్నారని. అది పబ్లిక్ మీటింగ్‌లో కావొచ్చు. రోడ్డు మీద కావొచ్చు. ఎక్కడైనా ప్రవర్తన చాలా ముఖ్యం. ఎప్పుడూ ఏ రూపంలో వివాదంలో చిక్కుకోవాల్సి వస్తుందో చెప్పలేమ్. ఏ మాత్రం టంగ్ స్లిప్ అయినా..ఎక్కడ తమ బిహేవియర్ డిఫరెంట్‌గా కనిపించినా..మీడియా, సోషల్ మీడియా చెడుగుడు ఆడేస్తుంది. ఆ తర్వాత ఎన్ని వివరణలు ఇచ్చుకున్నా..ఎన్ని కవర్ డ్రైవ్‌లు చేసినా డ్యామేజ్ కంట్రోల్ అవడం కష్టం. ఒక ఎమ్మెల్యే చేసే మిస్టేక్ ఆయనకే పరిమితం కాదు. ఓవరాల్ పార్టీకి బ్యాడ్‌నేమ్ తెస్తున్న పరిస్థితి.టీడీపీ ఎమ్మెల్యేల విషయంలో సీన్ మరోలా ఉంది. ఎప్పుడూ ఎవరో ఒక ఎమ్మెల్యే వివాదాల్లో చిక్కుకోవడం..సీఎం చంద్రబాబు సీరియస్ అవడం కామన్ అయిపోయింది. అందరిదీ ఒక కథ అయితే..కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎపిసోడ్ సమ్‌థింగ్ డిఫరెంట్. ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే అయిన సురేంద్రబాబుకు నియోజకవర్గంలో మంచి పేరే ఉందంటున్నారు తెలుగు తమ్ముళ్లు. ఆయన ఎలాంటి కాంట్రవర్సీలు, అనవసర విషయాలకు జోలికి వెళ్లరని చెప్తున్నారు. కానీ టోల్ ప్లాజా ఎపిసోడ్‌లో ఆయన అనుచరులు చేసిన వీరంగం పెద్ద రచ్చ అయింది. చివరకు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు రియాక్ట్ అయి కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించే వరకు వచ్చింది.టోల్ గేట్ దగ్గర ఏం జరిగింది.. తప్పు ఎవరిదన్న విషయం పక్కన పెడితే జరగాల్సిన ఇష్యూ జరిగింది. టీడీపీ, కూటమి ప్రభుత్వంపై విమర్శలు రావడం..డ్యామేజ్ కంట్రోల్ కోసం చర్యలు తీసుకోవడం చకచకా జరిగిపోయాయి. అయినా చర్చకు, విమర్శకు అవకాశం ఇచ్చినట్లు అయింది. ఇక్కడ ఎమ్మెల్యే విషయంలో ఎవరికి ఎలాంటి అభ్యంతరం లేకున్నా..ఆయన ముందే టోల్ గేట్ సిబ్బందిపై అనుచరులు దాడి చేశారన్న వార్తలు తీవ్ర విమర్శలకు దారితీశాయి.సీఎం చంద్రబాబు పదేపదే ఎమ్మెల్యేలకు సూచిస్తున్నది ఇదే. పబ్లిక్ లైఫ్‌లో ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలి. చిన్న ఇష్యూనే కదా ఏం కాదు అనుకుంటే కుదరదు అంటూ పదే పదే హెచ్చరిస్తూ వస్తున్నారు. ప్రజాప్రతినిధుల బిహేవియర్ చాలా ఇంపార్టెంట్. జనం మన ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటారన్న విషయం గుర్తు చేస్తూనే ఉన్నారు. అయినా అక్కడక్కడ ఎమ్మెల్యేలు..పొరపాటుగానో..కావాలనో రచ్చకెక్కడం, ఇష్యూకు తెరలేపడం రెగ్యులర్ అయిపోయింది. అనవసర విషయాలు, కాంట్రవర్సీల్లో వేలు పెడుతున్న ఎమ్మెల్యేల విషయంలో ఇప్పటికే పలుసార్లు సీరియస్ అయిన సీఎం చంద్రబాబు..ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు నాటికి కఠినంగా వ్యవహరించాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.

## 'కార్మికులందరికి మేడే శుభాకాంక్షలు': మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



మంథని: అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం (మేడే) సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కార్మికులందరికి మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ రోజు మంథని పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద నిర్వహించిన మేడే వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని, ముఖ్యంగా మున్సిపల్ కార్మికులు పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతూ అభివృద్ధికి విశేషంగా తోడ్పడుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ సమాజ పురోగతికి కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మంథని పట్టణంలో పనిచేస్తున్న కార్మికుల్లో ఇల్లులేని వారికి గుర్తింపు ఇచ్చి, వారికి ఇందిరమ్మ ఇళ్లను అందించే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## మే డే సందర్భంగా ఏఐటియుసి జెండాను ఆవిష్కరించిన భూసిపాక సాయిలు



డిండి (తెలంగాణ వాణి) డిండి గ్రామ పరిధిలో హనుమాన్ భవనం దగ్గర మేడే సందర్భంగా జండా ఏఐ టి యు సి ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సాయిలు గ్రామ కార్యదర్శి అవుట చిన్నయ్య సభ్యులు భూసిపాక లింగమయ్య అవుట్ గెలవయ్య ఎత్తవు బాలస్వామి రమేషు కాసిం అవుట శీను ఔటర్ రవి ఆవుల మల్లయ్య వావిళ్ళ తిరుపతి బిల్లి శంకర్ ఔటర్ లక్ష్మమ్మ చెన్నమ్మ లక్ష్మమ్మ కండక్టర్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# అదనపు విద్యుత్.. అరకొర ధర



ముంబై, : భారతదేశం 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే ప్రతిష్టాత్మక లక్ష్యంతో ముందుకు సాగుతోంది. అయితే, ఈ పచ్చని కల వెనుక విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. నిబంధనల ప్రకారం సోలార్ విద్యుత్‌ను తప్పనిసరిగా కొనాల్సిన డిస్కంలు, తీరా వాడుక సమయంలో డిమాండ్ లేకపోవడంతో ఆ విద్యుత్‌ను ఎక్స్ఛేంజీల్లో కారుచౌకగా అమ్ముకోవాల్సి వస్తోంది. సాధారణంగా యూనిట్ రూ. 2 నుంచి రూ. 3.50 వెచ్చించి కొనుగోలు చేస్తుంటే, మార్కెట్లో కేవలం 50 పైసలకే విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది.దేశంలో అతిపెద్ద విద్యుత్ ఎక్స్ఛేంజ్ అయిన ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ గణాంకాల ప్రకారం.. గరిష్టంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తి అయ్యే మధ్యాహ్నం వేళల్లో యూనిట్ ధర ఒక్కోసారి రూ. 0.50 పైసలకు పడిపోతోంది. డిస్కంలు దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా ఈ విద్యుత్‌ను రూ. 3 పైనే వెచ్చించి సేకరిస్తాయి. ఒకవేళ ఎక్స్ఛేంజీలో అమ్మకపోతే ఆ విద్యుత్ వృథా అవుతుంది, కాబట్టి "ఏమీ రాకపోవడం కంటే.. రూపాయి వచ్చినా చాలు" అనే ధోరణితో డిస్కంలు ఈ నష్టదాయక వ్యాపారాన్ని సాగిస్తున్నాయి.ఈ సంక్షోభం వెనుక ప్రధానంగా 'పునరుత్పాదక కొనుగోలు బాధ్యత' అనే నిబంధన ఉంది. దీని ప్రకారం ప్రతి డిస్కం తాము పంపిణీ చేసే విద్యుత్‌లో కొంత శాతాన్ని తప్పనిసరిగా సౌర లేదా పవన విద్యుత్ రూపంలోనే సేకరించాలి. రాబోయే ఐదేళ్లలో ఈ లక్ష్యం 43 శాతానికి పెరగనుంది. దీనివల్ల అవసరం లేకున్నా డిస్కంలు విద్యుత్‌ను కొనాల్సి వస్తోంది."దేశంలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెరుగుతోంది కానీ, దాన్ని నిల్వ చేసే బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు ఇంకా అందుబాటులోకి రాలేదు. అందుకే మధ్యాహ్నం వేళల్లో ఉత్పత్తి అయ్యే భారీ విద్యుత్‌ను ఏం చేయాలో పాలుపోక ఎక్స్ఛేంజీల్లో విక్రయిస్తున్నారు" అని ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజ్ ( ఎండీ రాజేష్ మెడిరట్టా విశ్లేషించారు.భారతదేశంలో ప్రస్తుతం గ్రిడ్ స్థిరత్వం కోసం బ్యాటరీ స్టోరేజ్‌తో కూడిన విద్యుత్ ధర యూనిట్‌కు సగటున రూ. 5 వరకు ఉంది. ఇది డిస్కంలకు భారంగా మారుతోంది. మరోవైపు గత ఏడాది మే నెలలో భారీ వర్షాల కారణంగా డిమాండ్ తగ్గి, విద్యుత్ ధర ఎక్స్ఛేంజీల్లో సున్నాకు పడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి.ఇప్పటికే దేశవ్యాప్తంగా డిస్కంలు సుమారు రూ. 6 లక్షల కోట్ల రుణ భారంతో సతమతమవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ డిస్కంల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలను అందుకోవాలనే తొందరలో డిమాండ్‌ను సరిగ్గా అంచనా వేయకుండా చేస్తున్న కొనుగోళ్లు ఈ అప్పులను మరింత పెంచుతున్నాయి.కేవలం సోలార్ ప్యానెల్స్ పెంచుకుంటూ పోతే సరిపోదు. వ్యవసాయ రంగానికి ఇచ్చే విద్యుత్ సరఫరాను పగటిపూటకి మార్చడం, థర్మల్ ప్లాంట్లను అవసరానికి తగ్గట్టుగా నియంత్రించడం వంటి నిర్మాణాత్మక మార్పులు చేయాలి" అని హెక్సా క్లైమేట్ సొల్యూషన్స్ చైర్మన్ సంజీవ్ అగర్వాల్ సూచించారు.విద్యుత్ రంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. 'టైమ్ ఆఫ్ ది డే'టారిఫ్ విధానం దీనికి సరైన పరిష్కారం. అంటే సౌర విద్యుత్ సమృద్ధిగా దొరికే పగటి వేళల్లో తక్కువ ధరకే వినియోగదారులకు విద్యుత్ అందించి, డిమాండ్ ఎక్కువగా ఉండే సాయంత్రం వేళల్లో రేట్లు పెంచడం. దీనివల్ల డిమాండ్ మేనేజ్మెంట్ సులువవుతుంది. అలాగే, రాష్ట్రాల అవసరాలను బట్టి నిబంధనల్లో వెసులుబాటు కల్పించాలని మాజీ విద్యుత్ శాఖ కార్యదర్శి అలోక్ కుమార్ అభిప్రాయపడ్డారు.

# తెలంగాణలో భారీగా నిరుద్యోగం

హైదరాబాద్, : ఇటీవల విడుదలైన గణాంకాల ప్రకారం తెలంగాణలో నిరుద్యోగ సమస్య ఆందోళనకరంగా మారింది. ప్రముఖ ఫైనాన్షియల్ సంస్థ బజాజ్ బ్రోకింగ్, కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 'ఇండియన్ ఎకనామిక్ సర్వే 2025-26' ఆధారంగా ఒక నివేదికను వెల్లడించింది. దీని ప్రకారం ప్రస్తుతం తెలంగాణలో నిరుద్యోగిత రేటు 8.9 శాతానికి చేరుకొని దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.దేశ సగటు నిరుద్యోగిత రేటు 5.2 శాతంగా ఉండగా, తెలంగాణలో అది అంతకంటే 3.7 శాతం ఎక్కువగా ఉంది. ఏపీ (8.2%), కర్ణాటక (8.0%) వంటి పొరుగు రాష్ట్రాల కంటే కూడా తెలంగాణలో నిరుద్యోగం అధికంగా నమోదైంది.2022లో బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ నిరుద్యోగిత రేటు కేవలం 0.7 శాతంగా ఉండేదని, అప్పట్లో ఉపాధి కల్పనలో రాష్ట్రం దక్షిణ భారతదేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని నివేదిక గుర్తు చేస్తోందిగత ప్రభుత్వ హయాంలో నెలకు సగటున 2,037 ఉద్యోగ నియామకాలు జరగగా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గత రెండున్నరేళ్లలో ఆ వేగం తగ్గి నెలకు సగటున 566 నియామకాలకు పరిమితమైందని గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా, ప్రైవేట్ రంగంలోనూ ఆశించిన స్థాయిలో కొత్త అవకాశాలు రాకపోవడం, ఉన్న ఉద్యోగాల్లో కోతలు నిరుద్యోగులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఆశించిన స్థాయిలో రాకపోవడం , జాబ్ క్యాలెండర్ అమలులో జాప్యం కారణంగానే రాష్ట్రంలో ఈ పరిస్థితులు నెలకొన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఏపీ పదో తరగతి ఫలితాల్లో టాపర్



## 600 మార్కులకు 599 వచ్చాయి

## విశాఖకు చెందిన జ్ఞానేశ్వరి టాప్

విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 85.25 శాతం ఉత్తీర్ణత నమోదుకాగా.. గతేడాది 81.14 తో పోలిస్తే ఈసారి 4.15 శాతం ఉత్తీర్ణత మెరుగుపడింది. ఈసారి కూడా ఫలితాల్లో అమ్మాయిలు అదరగొట్టారు. మొత్తం 87.90 శాతం మంది బాలికలు ఉత్తీర్ణులుకాగా.. 82.68శాతం మంది బాలురు పాసయ్యారు. అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలు 5.22 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించారు. అంతేకాదు టెన్త్‌లో ఉత్తీర్ణులైన వారిలో అత్యధికంగా 83.69% మంది ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యారు. టెన్త్ ఫలితాల్లో విద్యార్థులు అదరగొట్టారు. విశాఖపట్నానికి చెందిన కె జ్ఞానేశ్వరి అత్యధికంగా 600 మార్కులకు గాను 599 మార్కులు కైవసం చేసుకున్నారు. ఆమె ఎన్ఏడీలోని శ్రీచైతన్య స్కూల్‌లో చదివారు. కె జ్ఞానేశ్వరి తండ్రి కె శ్రీనివాసరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా.. తల్లి భారతి విశాఖ నేవల్ డాక్‌యార్డు ఉద్యోగినిగా ఉన్నారు. జ్ఞానేశ్వరి పదోతరగతి పరీక్షలకు ముందు టైఫాయిడ్ వచ్చింది. ఆ సమయంలో విద్యార్థిని భయపడ్డారు.. కానీ ఆమె కోలుకొని పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సంపాదించారు. మొత్తం 600 మార్కులకు 599 రాగా.. ఒక్క ఆంగ్లంలో ఒక్క మార్కు తగ్గింది.. అదికూడా వచ్చి ఉంటే 600కు 600 సాధించి ఉండేదని చెప్పారు. జ్ఞానేశ్వరి ఇంటర్ బైపీసీలో చేరాలని.. భవిష్యత్తులో డాక్టర్ కావాలనే లక్ష్యం ఉందని తెలిపారు. గతేడాది కాకినాడకు చెందిన విద్యార్థిని నేహాంజని 600కు మార్కులకు 600 మార్కులు సాధించి రికార్డ్ సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మాత్రం 600కు 599 మార్కులు వచ్చాయి. ఈసారి ఒక్క మార్కు తగ్గింది. ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 16 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదు. మొత్తం 2161 స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది.

పార్వతీపురం మన్యం జిల్లా 96.07శాతం ఉత్తీర్ణతతో టాప్‌లో నిలిచింది. అల్లూరి సీతారామరాజు జిల్లా 57.12 శాతంతో చివరి స్థానంలో ఉంది. రాష్ట్రంలో విశాఖకు చెందిన కె జ్ఞానేశ్వరి 600కు 599 మారకులు సంపాదించగా.. 47 మంది విద్యార్థులకు 598 మార్కులు వచ్చాయి. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 96.04శాతం ఉత్తీర్ణత నమోదైంది. మరోవైపు పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలుమే 25 నుంచి జూన్ 4 వరకు నిర్వహించనున్నారు. మే 1 నుంచి 9 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి..

రీ కౌంటింగ్, రీవెరిఫికేషన్ మే 1 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు రీకౌంటింగ్ కోసం సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు టీచర్ల ద్వారా ఫోన్ కాల్స్ చేయిస్తున్నారు. భరోసానిచ్చేందుకు, తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులపై ఎక్కువ దృష్టి పెడతామన్నారు. పాఠశాలల వారీగా విద్యార్థుల వివరాలు సేకరించి వా రికోసం స్కూల్స్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహించి సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేస్తామని తెలిపారు.

# కరీంనగర్ లో కయ్యాల కాంగ్రెస్



కరీంనగర్, : కాంగ్రెస్ అంటేనే కయ్యాల పార్టీ. తెలుగు రాష్ట్రాల్లో అయితే మరీ ఎక్కువ. ఒక నేత ఎదుగుదలను మరో నేత ఓర్వలేడు. ఒకరి ఆధిపత్యాన్ని మరొకరు సహించరు. ఎవరికి వారు గ్రూపులుగా ఉంటారు. అవసరమైతే అధిష్టానాన్ని కూడా బూతులు తిడతారు. తర్వాత కలిసే ఉంటారు. ఏమన్నా అంటే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అని పెద్దపెద్ద మాటలు చెబుతారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీలో కొన్నాళ్లు కయ్యాలు కనిపించలేదు. కానీ ఆరు నెలలుగా లుకలుకలు బయటపడుతున్నాయి. తాజాగా కరీనంగర్‌లో బిభేదాలు రచ్చకెక్కాయి. కరీంనగర్ కాంగ్రెస్‌లో ఇన్‌చార్జి నియామకం వివాదం పార్టీ ఐక్యతను దెబ్బతీసింది. స్థానిక నేతల అసంతృప్తి, అధిష్ఠాన నిర్ణయాలపై బహిరంగ తిరస్కారం శ్రేణుల్లో గందరగోళాన్ని మురికి చేస్తోంది.వెలిచాల్ రాజేందర్ రావును కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడం పలువురు స్థానిక నాయకుల అభ్యంతరానికి దారితీసింది. సర్పంచులు, మాజీ కార్పొరేటర్లు తమ పేర్లతో వినతిపత్రాలు సమర్పించారని, తమ సమ్మతి లేకుండానే జరిగిందని మండిపడ్డారు. సన్నాహక సమావేశాల్లోనే విభేదాలు బహిర్గతమై, గొడవల వరకు వెళ్లింది.మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌లాంటి మునుపటి నాయకులు పార్టీ నాయకత్వంపై ఫైర్ అవుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల్ రాజేందర్ రావును లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల్లో సహకారం లేకపోవడం, టికెట్ కేటాయింపుల్లో భేదం వంటి ఆరోపణలు ఉన్నాయి. డీసీసీ కార్యాలయంలో రహస్య సమావేశాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.కరీంనగర్ కాంగ్రెస్‌లో మూడు ముక్కలాట జరుగుతోంది. గత మున్సిపల్ మున్సిపల్ ఎన్నికల్లో 66 డివిజన్లలో కేవలం 14 సీట్లకే పరిమితమైంది. ఇన్‌చార్జి లేకపోవడం, జిల్లా అధ్యక్ష పదవి ఆలస్యం ఈ సమస్యలకు ఆధారం. మంత్రివర్గ విస్తరణలో కూడా స్థానికులకు ప్రాధాన్యత లేకపోవడంపై నిరాశ వ్యక్తమవుతున్నారు. ఈ వివాదం పీసీసీ స్థాయికి చేరి, సస్పెన్షన్ డిమాండ్లు ఉయరుతున్నాయి. ఎన్నికల విషయాల్లో పార్టీ బలం తగ్గుతున్న ఈ ప్రాంతంలో ఇది మరింత దెబ్బ తీస్తుంది.అధిష్టానం త్వరగా స్థానిక నేతలతో సమావేశాలు నిర్వహించి, పునర్నియామకాలు చేయాలి. పారదర్శకత, స్థానిక ప్రాతినిధ్యం పెంచితే శ్రేణులు ఏకతాటిపై నడవవచ్చు. లేకపోతే రాబోయే ఎన్నికల్లో మూడో స్థానానికి మాత్రమే పరిమితమవుతుంది.

# పాత బస్సులకు కొత్త రంగులు...

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుస్థిర విద్యుత్ వాహన పాలసీ కింద ఆర్టీసీలో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో డీజిల్ ఖర్చు తగ్గించి కాలుష్యాన్ని నివారించేందుకు విద్యుత్ బస్సుల్ని తీసుకొస్తోంది. కేంద్రంనుంచి 1050 బస్సులు కేటాయించగా.. మరో 1450 బస్సుల్ని తీసుకురావాలని నిర్ణయించింది. అంతేకాదు కాలం చెల్లిన పాతబస్సుల్ని రీమోడల్ చేసి విద్యుత్ బస్సులుగా మార్చేస్తోంది. పాత డీజిల్ బస్సును విద్యుత్ బస్సుగా మార్చేశారు. ఈ మేరకు ట్రయల్ రన్ నిర్వహించారు.ఆర్టీసీలో పాత బస్సులు కొన్ని లక్షల కిలోమీటర్లు తిరిగి ఉంటాయి.. ఈ కాలం చెల్లిన బస్సును ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ కింద రెట్రోఫిట్‌మెంట్ చేసి, విద్యుత్‌తో నడిచే ఏసీ బస్సుగా మార్చేశారు. పాత సూపర్ లగ్జరీ బస్సును కళ్యాణీ ట్రాన్స్ సంస్థ (భారత్ ఫోర్జ్) ప్రయోగాత్మకంగా విద్యుత్ ఏసీ బస్సు (ఇంద్ర సర్వీస్)గా మార్చేసింది. ఈ కొత్త ఎలక్ట్రిక్ బస్సును విజయవాడ ఆర్టీసీ హౌస్‌కు తీసుకురాగా అధికారులు పరిశీలించారు. ఈ బస్సును కొంతకాలం ట్రయల్ రన్ కోసం ఏదైనా రూట్‌లో నడపాలని నిర్ణయించారు. ఈ బస్సుకు ఎంతసేపు ఛార్జింగ్ చేస్తే ఎన్ని కిలోమీటర్లు మైలేజ్ వస్తుందో పరిశీలించనున్నారు. పాత బస్సుల్ని ఇదే తరహాలో రెట్రోఫిట్‌మెంట్ చేస్తే ఎంత ఖర్చవుతుంది?.. కొత్త విద్యుత్ ఏసీ బస్సులు తీసుకోవడం కంటే.. ఇలా పాత వాటిని మార్పు చేస్తే ఎంత ఖర్చవుతుంది? వంటి అంశాలను పరిశీలించనున్నారు. ఇప్పటికే చిత్తూరు ఆర్టీసీ డిపోలో డీజిల్ బస్సును సీఎన్జీ బస్సుగా మార్చేశారు.. ఇప్పటికే ఈ బస్సు ట్రయల్ రన్ కూడా పూర్తి చేశారు. ఇప్పుడు పాత బస్సుల్ని




విద్యుత్ బస్సులుగా మార్చేస్తున్నారు.మరోవైపు ఏపీఎస్ఆర్టీసీకి ఎలాంటి డీజిల్ కొరత లేదని ఆర్టీసీ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 11 వేల బస్సులకు రోజుకు 7.5 లక్షల లీటర్ల డీజిల్ ఖర్చవుతుంది.. అయితే ప్రస్తుతం అన్ని బస్సు సర్వీసులు ఎలాంటి ఇబ్బంది లేకుండా నడుస్తున్నాయని చెప్పారు. ఆర్టీసీ బస్సులకు సంబంధించిన డీజిల్ విషయంలో ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని అధికారులు తెలిపారు

# తీరనున్న కనిగిరి ప్రాంత వాసుల కల

ఒంగోలు, : పశ్చిమ ప్రకాశం, మార్కాపురం జిల్లావాసులు.. ముఖ్యంగా కనిగిరి ప్రాంత ప్రజల కలనెరవేరనుంది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రైలు సౌకర్యం త్వరలోనే అందుబాటులోకి రానుంది. గుంటూరు నుంచి కనిగిరి వరకు ప్యాసింజర్ రైలును నడిపేందుకు రైల్వే అధికారులకు ప్రతిపాదనలు పంపారు. వారంలో ఆరు రోజుల పాటూ రైలును నడిపేలా ప్రతిపాదించారు. రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారని.. త్వరలోనే అధికారిక ప్రకటన వస్తుందని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కేంద్రం సహకారంతో రైల్వే ప్రాజెక్టుల పనులు వేగవంతం అవుతున్నాయి. పాత ప్రాజెక్టులతో పాటుగా కొత్త ప్రాజెక్టులు కూడా ఒక్కొక్కటిగా పట్టాలెక్కుతున్నాయి. రాష్ట్రంలో కీలకమైన నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు వేగవంతం చేసి ఉమ్మడి ప్రకాశం జిల్లా, ప్రస్తుతం మార్కాపురం జిల్లా కనిగిరి వరకు పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం పామూరు వైపుగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కనిగిరి వరకు రైల్వే లైన్ పనులు పూర్తికావడంతో అక్కడి వరకు రైళ్లు నడపాలని ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులతో పాటుగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.. రైల్వేశాఖకు విన్నవించారు. కనిగిరి వాసుల ఎన్నో ఏళ్ల కలను నిజం చేసే దిశగా ఓ ముందడుగు పడింది. నడికుడి టు శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్‌లో కనిగిరి వరకు ప్యాసింజర్ రైలును నడిపేందుకు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. గుంటూరు నుంచి గుండ్లకమ్మ మీదుగా కనిగిరి వరకు ఈ రైలును నడిపేందుకు గుంటూరు రైల్వే డివిజన్ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఈ నెల 24న ఆ వివరాలు అధికారుల దగ్గరకు చేరాయి. తాజా ప్రతిపాదనల ప్రకారం వారంలో ఆరు రోజుల పాటూ గుంటూరు నుంచి కనిగిరి వరకు ఈ కొత్త సర్వీస్‌ను నడపాలని ప్రతిపాదించారు. ఈ ప్యాసింజర్ రైలు గుంటూరులో ఉదయం 8.30 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1 గంటకు కనిగిరి చేరుకునేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2 గంటలకు కనిగిరి నుంచి బయల్దేరి రాత్రి 7 గంటలకు గుంటూరు చేరుకునేలా ప్లాన్ చేశారు. అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే పూర్తి షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు.నడికుడి టు శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్‌లో కనిగిరి వరకు రైలును నడపాలని గతంలోనే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి రైల్వే అధికారులకు విన్నవించారు. ఇటీవల రైల్వే అధికారుతో మాట్లాడటంతో సానుకూలంగా స్పందించారు. కనిగిరి రైల్వే స్టేషన్ పనులు పూర్తికావడం, ప్రయాణికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందబాటులోకి రావడంతో ఎలాంటి ఇబ్బందులు లేవు అంటున్నారు. ఇప్పటికే ట్రయల్ రన్ కూడా పూర్తి చేయడంతో.. కొత్తగా ప్యాసింజర్ రైలును కనిగిరి వరకు నడిపేందుకు దాదాపుగా లైన్ క్లియర్ అయినట్లేనని చెబుతున్నారు. కనిగిరి నుంచి ప్యాసింజర్ రైలు ప్రారంభమైతే ఆ ప్రాంతం నుంచి రాజధాని ప్రాంతమైన గుంటూరుకు కనెక్టివిటీ కూడా పెరుగుతుందంటున్నారు. కనిగిరి మాత్రమే కాదు పొదిలి, దర్శి ప్రాంతాల ప్రజలకు కూడా ఎంతో సౌకర్యంగా ఉంటుంది. మొత్తం మీద మార్కాపురం, పశ్చిమ ప్రకాశం జిల్లావాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతోంది.

# ప్రకాశం జిల్లా పోలీసుల నైట్ బీట్ చెకింగ్

## నేరాల నియంత్రణపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ

ఒంగోలు: ప్రకాశం జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో రాత్రి వేళల్లో నైట్ బీట్ చెకింగ్ కార్యక్రమం విస్తృతంగా నిర్వహించారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణ లక్ష్యంగా పోలీసు అధికారులు కీలక ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి పత్రాలు పరిశీలించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, రాత్రి వేళల్లో అనవసరంగా తిరిగే వ్యక్తులను హెచ్చరించారు. ముఖ్య కూడళ్లు, రహదారులు, గ్రామ పరిసర ప్రాంతాల్లో పోలీసుల పహారా బలోపేతం చేశారు.ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా, ఎలాంటి అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. ప్రజల సహకారంతో నేరాలను అరికట్టడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

## ఆది జాంబవ సంఘం ఆధ్వర్యంలో అంబలి పంపిణి



మందమర్రి టౌన్ (తెలంగాణ వాణి విలేకరి): ఆది జాంబవ సంఘం ఆధ్వర్యంలో మందమర్రి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం అంబలి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, పట్టణ ఎస్.ఐ గోపతి నరేష్ లు హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆది జాంబవ సంఘం గౌరవ అధ్యక్షులు తుంగపిండి శంకర్, అధ్యక్షులు కంబాల రాజనర్సు, వర్కింగ్ ప్రెసిడెంట్ బీదునూరి శంకర్,ప్రధాన కార్యదర్శి దాసరి రాజనర్సు, ఉపా ధ్యక్షులు తుంగపిండి శ్రీనివాస్, దాసరి ఎల్లారం, ఆసం కొమురయ్య, నాయిని శంకర్, అధికార ప్రతినిధి ఉప్పులేటి నరేష్, ప్రచార కార్యదర్శి కలవల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ కలెక్టర్‌ను కలిసిన ముధోల్ ఎమ్మెల్యే

నిర్మల్-భైంసా (తెలంగాణ వాణి ప్రతినిధి): నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భవేష్ మిశ్రా ని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మరియు మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ముధోల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు,ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై ఇరువురు చర్చించారు.పలు కీలక సమస్యలను ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా,వాటిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.రైతులు పండించిన పంటలను విక్రయించేందుకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు,సబ్‌సెంటర్లలో గన్నీ బ్యాగులు,రవాణా సౌకర్యాల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే వివరించారు. ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఇరువురు నిర్ణయించారు.



# నీటి సమస్యకు చెక్ బోరు మంజూరు



నిర్మల్-తానూరు (తెలంగాణ వాణి ప్రతినిధి): నిర్మల్ జిల్లా తానూరు మండలంలోని బామిని తండా గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడికి చెక్ పడింది. ముధోల్ మాజీఎమ్మెల్యే జి. విట్టల్ రెడ్డిచొరవతో గ్రామానికి బోరు మంజూరు అయ్యింది. తండాలో తీవ్రంగా ఉన్న నీటి సమస్యను నెల రోజుల క్రితం గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు నివేదించారు. దీంతో వెంటనే స్పందించిన ప్రభుత్వం బోరు కోసం రూ. 1 లక్ష మంజూరు చేసింది. ప్రొసీడింగ్ కాపీని గ్రామస్తులకు అందజేశారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలకు మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న,మాజీ ఆత్మ చైర్మన్ పూత రెడ్డి,సర్పంచ్ రోహిదాస్, తండావాసులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం వరి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్ కుమార్**



మంచిర్యాల : మంచిర్యాల నియోజకవర్గంలోని రైతులు పండించిన వరి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వరి ధాన్యం ఉప్పల వద్ద రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాల నిర్వహణ, వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వరి పంట ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి ఎండల దృష్ట్యా వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కు నీడ, త్రాగునీటి సదుపాయాన్ని కల్పించాలన్నారు. రైతులు పండించిన వరి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దంపేట గ్రామ సర్పంచ్ జాడి వెంకటేష్, నాయకులు మొగిలి శ్రీనివాస్, మాధవరపు జీవన్ రావ్, వంశీ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రసాయన శాస్త్రంలో నగరపు లక్ష్మీకుమారి కి పీహెచ్.డీ.



పటాన్ చెరు, మే 1, తెలంగాణ వాణి రిపోర్టర్) హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని నగరపు లక్ష్మీ కుమారి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'క్లోఫరాబైన్, డెసిటాబైన్, బెలినోస్టాట్, బోర్టెజోమిబ్ తయారీలో కీలక మధ్యస్థ పదార్థాలు, క్రియాశీల ఔషధ పదార్థాల (ఏపీఐ) సంశ్లేషణ కు అధునాతన విధానాల'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిత్తలూరి సుధాకర్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ కుమారి చేసిన డాక్టరల్ పరిశోధన, కీలకమైన ఔషధ మధ్యస్థ పదార్థాలు, క్రియాశీల ఔషధ పదార్థాల (ఏపీఐల) సంశ్లేషణ కోసం వినూత్న, సమర్థవంతమైన వ్యూహాలను అందిస్తుందన్నారు. ఈ అధ్యయనం తేలికపాటి చర్య పరిస్థితులలో తక్కువ ఖర్చుతో కూడిన కారకాలను వినియోగించడం ద్వారా, పారిశ్రామిక వినియోగానికి అనువైన వేగవంతమైన, అధిక దిగుబడినిచ్చే, విస్తరించదగిన ప్రక్రియలను సూచిస్తోందని తెలిపారు.

డాక్టర్ కుమారి పరిశోధన, క్యాన్సర్ నిరోధక మందుల అభివృద్ధికి గణనీయమైన అవకాశాలను అందించే ఆచరణాత్మక, పారిశ్రామిక-ఆధారిత సంశ్లేషణ పద్ధతులను పరిచయం చేస్తుందన్నారు. ప్రాణాలను కాపాడే ఈ చికిత్సా విధానాల తయారీలో ఎదురయ్యే కీలక సవాళ్లను పరిష్కరించడం ద్వారా, ఆమె పరిశోధన ఔషధ రసాయన శాస్త్రం, ఔషధ తయారీ రంగాలలో పురోగతికి గణనీయంగా దోహదపడుతుందని వెల్లడించారు. డాక్టర్ కుమారి సాధించిన ఈ విజయం ఆమె అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుందని, క్యాన్సర్ చికిత్సల భవిష్యత్తుకు ఒక విలువైన తోడ్పాటును అందిస్తుందనీ పలువురు అభినందించారు.

# హమాలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు



చిగురుమామిడి మే 01 ( తెలంగాణ వాణి విలేఖరి ): కరీంనగర్ జిల్లా,చిగురుమామిడి మండలం,141వ మే డే సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం రేకొండ బాస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన జెండాను ఎగురవేసినన హమాలీ సంఘం అధ్యక్షులు బోయిని సంజీవ్ ఆయన మాట్లాడుతూ కార్మికులకు పని గంటల వేలల్లో మార్పుల కోసం, హక్కుల కోసం,సమ్మె హక్కు కోసం అమెరికా లోని చికాగో నగరంలో 1886 లో లక్షలాది మంది కార్మికులు సమ్మె చేసి,అనేక మంది ప్రాణతర్పణంతో , మే డే ఆరంభం అయిందని,ఆ స్ఫూర్తితో ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు మేడే జరుపుకుంటున్నారని,నాటి నుండి నేటి వరకు ప్రపంచ దేశాలతో శ్రమను నమ్ముకొని జీవిస్తున్న అన్ని వర్గాల వారు జరుపుకునే ఏకైక పండగ మే డే అని,పోరాడి సాధించుకున్న హక్కుల ద్వారా నాడు కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండాయని,వారు తెలిపారు . ఈ కార్యక్రమములో హమాలి సంఘ అధ్యక్షులు బోయిని సంజీవ్, గ్రామ శాఖ కార్యదర్శి వల్లభాయ్ పటేల్,సందవేని వెంకటయ్య, రవీందర్, పరకాల వెంకటేశం,గాజపాక రవీందర్, శేరాలు,గడిపే బాలయ్య,ఆకారపు చేంద్రయ,వార్డు మెంబర్ బొయిని అనిల్,పరిశారాములు, మైలారపు లక్ష్మయ్య, కర్ణాల మొగిలి,చెంచాల రవీందర్,హమాలి సంఘమ్,మరియు ,వివిధ సంఘాల నాయకులు,తదితరులు, పాల్గొన్నారు .

# మే డే సందర్భంగా జెండా ఆవిష్కరించిన నాగిళ్ల లక్ష్మయ్య



చందంపేట (తెలంగాణ వాణి ప్రతినిధి) మే డే ఫస్ట్ కార్మికుల దినోత్సవ వేడుకకు ముఖ్య అతిథిగా తాపీ మేస్త్రి సంఘం చందంపేట మండల అధ్యక్షులు అందుగుల సైదులు హాజరై ప్రపంచవ్యాప్తంగా మే డేలు జరుపుకోవడం ఎంతో సంతోషం ఒకప్పుడు 12 గంటలు పనిచేసే వ్యవస్థను కుదించి 8 గంటలకు చేయడానికి ఎంతోమంది కార్మికులు మే డే ఫస్ట్ కు సమ్మెలో పాల్గొని ప్రాణాలు అర్పించి ఎర్రటి రక్తపు దారల్లో ఎరుపు జెండా కార్మికుల దినోత్సవ సందర్భంగా ఈ కార్యక్రమంలో పోలేపల్లి గ్రామ కార్యదర్శి నల్ల శ్రీను నాగిళ్ల రామస్వామి నాగిళ్ల రాఘవేంద్ర సల్వాది శీను అంకురి విజయ్ అందుగుల విష్ణు ఈశ్వర్ వివిధ సంఘాలు అమ్మాలి సంఘం ఆటో సంఘం సెంట్రింగ్ సంఘం తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్న ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు



జగిత్యాల/ బుగ్గారం :1 మే (తెలంగాణ వాణి విలేకరి): జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామంలో ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్ గా ప్రశంస పత్రం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ముత్యాల నాగరాజు అందుకోవడం జరిగింది. గ్రామా లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అటువంటి నిరుపేద కూలీలకు ఉపాధి హామీ పథకం చేపట్టిన అంశంలో భాగంగా పేద ప్రజల వందరోజుల పథకం అనుసరించి గ్రామ ప్రజలను ప్రోత్సహించి కార్డు లేనివారికి జాబ్ కార్డ్స్ అందజేస్తూ సరైన క్రమంలో వారిని ముందుకు ఎక్కువ మందిని పని చేపించడంలో గుర్తించిన అధికారుల దృష్టిలో ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్ గాపేరు ప్రతిష్టలు గాంచిన ముత్యాల నాగరాజును గుర్తించి జిల్లా కలెక్టర్ కార్మిక శ్రమజీవుల (మే డే )సందర్భంగా శాలువా కప్పి సన్మానించి ఉత్తమ ప్రశంస పత్రం అందజేయడం జరిగింది.

# పెట్రల్ బంక్ లో అగ్ని ప్రమాదం రెండు ఆటోలో దగ్ధం

నారాయణగూడ: నారాయణ గూడ వైఎంసీఏ వద్ద ఉన్న హెచ్ పీ పెట్రోల్ బంక్ లో రెండు ఆటోలు దగ్ధం అయ్యాయి. ఓ ఆటో లో గ్యాస్ ఫిల్ చూస్తుండగా మంటలు...పక్కనే ఉన్న మరో ఆటకు మంటలు వ్యాపించడంతో బంక్ సిబ్బంది అప్రమత్తమైయారు. బంక్ కు మంటలు వ్యాపించకుండా తక్షణ చర్యలు చేపట్టారు. ఘటనలో బంక్ సిబ్బంది ఒకరికి గాయాలు అయ్యాయి. స్థానిక ఆసుపత్రికి తరలించారు.

# ఘనంగా మే డే ఉత్సవాలు జెండావిష్కరణ



కన్నాయిగూడెం (తెలంగాణ వాణి) ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో జెండావిష్కరణ చేసి మిఠాయిలు పంచి మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల ఉపాధ్యక్షుడు కావిరి సదానందం మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మిక, శ్రామికుల హక్కుల దినం కార్మికుల నెత్తుటి రక్తంతో సాధించిన రోజు మేడే అని, రోజు 16 గంటలు పనిచేస్తున్న నాటి శ్రామిక వర్గాన్ని విముక్తి చేసి ఎనిమిది గంటల పని కల్పించిన గొప్ప రోజు మేడే అని, ఈ పవిత్రమైన మేడే సందర్భంగా శ్రామిక కార్మిక, కర్షక వర్గాలు మరింతగా పోరాడి మరిన్ని హక్కులను సాధించాలని పిలుపునిచ్చారు. నాడు పరిశ్రమలలో కార్మికుల రోజుకు 16 నుంచి 18 గంటలు పని చేసేవారు దీనికి వ్యతిరేకంగా ఎనిమిది గంటల పని కోసం 8 గంటల విశ్రాంతి కోసం జరిగిన పోరాటంలో మేడే రోజున చికాగో నగరంలో నాటి పోలీస్ కాల్పులలో ప్రాణాలు కోల్పోయిన కార్మిక అమరవీరుల త్యాగం వల్లనే ఈ రోజు ప్రపంచ కార్మికులకు ఎనిమిది గంటల పని దినం అనేది సాధించడం జరిగిందని అన్నారు. మే ఒకటి 1986న అమెరికా వ్యాప్తంగా సమ్మెలు జరిగాయని, 1989 పారిస్ లో జరిగిన అంతర్జాతీయ కార్మిక సమావేశంలో 1986 చికాగో సమ్మెను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా మేడే రోజు అమరులైన కార్మికుల అమరత్వాన్ని, త్యాగనిరతిని ఎత్తిపడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కార్మికులందరికీ ఏటా మే 1న కార్మిక దినోత్సవం జరుపుకోవాలని, 1989లో ప్యారిస్ లోని ఈ సమావేశంలో నిర్ణయించడం జరిగిందని అన్నారు. అప్పటినుండి ఇప్పటివరకు ప్రతి సంవత్సరం మే 1న ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రామిక కార్మిక వర్గం మే డే స్ఫూర్తితో ఘనంగా జెండాలు ఎగిరేసికుంటుదని అన్నారు. పోరాడుతున్న కార్మికులకు మేడే ఒక స్ఫూర్తిదాయక పోరాటమని, అది అమరుల త్యాగాలకు మహోన్నతమైన ప్రతికని, ఆ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, హమాలి కార్మికులు గ్రామపంచాయతీ కార్మికులు, అంగన్వాడీ టీచర్స్ ఆశ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

# శిశు గృహను సందర్శించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, మే : 01 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) :పిల్లల సంరక్షణ విషయంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శిశు గృహలో నూతనంగా ప్రారంభించిన అదనపు భవనాన్ని ఆయన పర్యవేక్షించి, వసతులు, పిల్లల సంరక్షణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా శిశు గృహలో ఆశ్రయం పొందుతున్న చిన్నారుల ఆరోగ్య, వ్యక్తిగత పరిస్థితులను, సంరక్షణ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిశు గృహలోని చిన్నారులకు మెరుగైన భవిష్యత్తు అందించడంలో దత్తత ప్రక్రియ కీలకమని, అర్హులైన పిల్లలను చట్టపరమైన నిబంధనల ప్రకారం సకాలంలో దత్తత పంపించేలా అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని జిల్లా సంక్షేమ అధికారిణిని ఆదేశించారు. పిల్లల సంరక్షణ విషయంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని స్పష్టం చేశారు. దివ్యంగా చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా బాలలకు క్రీడా వస్తువులను కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం బాలలకు సేవలందిస్తున్న సిబ్బందిని శాలువాతో సత్కరించి, నూతన వస్త్రాలను, మెమెంటో లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, పంచాయతీ రాజ్ ఈఈ శివరాం, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, బాలల సంరక్షణ అధికారి స్వామి, లీగల్ కం ప్రొబేషన్ ఆఫీసర్ కుట్ల రమేష్, మేనేజర్ విజయలక్ష్మి, సోషల్ వర్కర్ స్వప్న, ఏఎన్ఎం, ఆయాలు, డిసిపియు సిబ్బంది పాల్గొన్నారు.



## పదవి విరమణ కార్మికుడికి ఘన సన్మానం

మందమర్రి టౌన్ మే 01 (తెలంగాణ వాణి విలేకరి) పట్టణంలోని రెండవ జూన్ మదీనా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో సింగ రేణిలో వాల్ మేన్ గా విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన ఎం డి. గౌస్ అజ్జు కు వెళ్లే సంద ర్భంగా మజీద్ సభ్యులు శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మాల వేసి శాలువా తో సన్మానించారు. ఈ కార్యక్రమం లో సదర్ ఎండి. బషీర్, ప్రధాన కార్యదర్శి ఎం.డి షరీఫ్, కమిటీ సభ్యులు ఎం.డి హోలీహైదర్, ఎం డి. కాజా , ఎం.డి. ఇస్మాయి ల్, షేక్ మమ్మద్ సాబ్, హైమద్ ఖాన్, మౌలానా ఎం.డి ముజామిల్ హుస్సేన్, ఎం.డి. అబ్బాస్ , ఎం.డి.మజార్ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ఉజ్వల భవిష్యత్తుకు 'బాల భరోసా' ఒక వరం : జిల్లా కలెక్టర్ అంకిత్





భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి): స్థానిక జిల్లా కేంద్రంలోని రామవరంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం లో జిల్లా సంక్షేమ అధికారిణి జె. స్వర్ణలత లేనినా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి "బాల భరోస" కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా, వారి ఎదుగుదలలో తలెత్తే లోపాలను తొలిదశలోనే గుర్తించి నివారించేందుకు 99 రోజుల ప్రజా ప్రణాళిక లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బాల భరోసా' కార్యక్రమం జిల్లా మహిళా శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గతవారం రోజులుగా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా ముఖ్యంగా సున్నా నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని, పిల్లల్లో ఉండే, న్యూరో డెవలప్‌మెంట్ (నాడీ వ్యవస్థ సంబంధిత) సమస్యలు, శారీరక ఎదుగుదల లోపాలు, మానసిక వికాసంలో ఆలస్యం వంటి అంశాలను ప్రారంభ దశలోనే గుర్తించడంద్వారా వారికి మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని , దానికి అనుగుణంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేసి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి భాగస్వామ్యం కావాలన్నారు. బాల భరోస" కార్యక్రమం ముఖ్య ఉద్దేశం సకాలంలో జోక్యం అని పిల్లలలో ఏవైనా లోపాలు ఉన్నట్లు గుర్తిస్తే, వెంటనే వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స ప్రారంభించి, ఆ సమస్య తీవ్రతరం కాకుండా చూడాలన్నారు. ప్రతి చిన్నారి శారీరక మరియు మానసిక స్థితిని నిశితంగా పరిశీలించి, అవసరమైన వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించడం. చిన్నారులు ఆరోగ్యంగా, సంతోషంగా పెరిగేలా చూడటమే కాకుండా, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లా సంక్షేమ అధికారిణి జె. స్వర్ణలత లేనినా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 2061 కేంద్రాలలో నమోదైన సున్నా నుండి ఐదు సంవత్సరాలలోపు అంగన్వాడి కేంద్రాలలో నమోదైన పిల్లలను ఆర్బిఎస్కే టీముల ద్వారా ముందస్తు అనారోగ్య గుర్తింపులో భాగంగా న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం ద్వారా జిల్లాలో ఉన్న 60000 మంది చిన్నారులను 42 ప్రశ్నల ద్వారా ఆన్లైన్ పోర్టల్లో వివరాలను నమోదు చేయడం జరిగిందని, దానికి అనుగుణంగా పిల్లల అభివృద్ధిలో వెనకడుగు, న్యూరో డెవలప్మెంట్, శారీరక లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి ఈరోజు జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ గారి నేతృత్వంలో ప్రత్యేక పర్యవేక్షణతో కూడిన పరీక్షలు నిర్వహించడం జరిగిందని, ఈ ఒక్క అవకాశాన్ని సద్వినియోగం ఈరోజు మాత్రమే చేసుకోకుండా సూచించిన తేదీలలో క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు నిర్వహించుకోవాలని, అంగనవాడి టీచర్లను సకాలంలో జోక్యం చేసుకొని స్థానిక ప్రాథమిక వైద్య కేంద్రాలలో చికిత్స అందించి పిల్లల సంపూర్ణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు, ప్రతి చిన్నారి ఆరోగ్యంగా , సంతోషంగా, సురక్షితమైన భవిష్యత్తును నిర్మించే బాధ్యత మన అందరిపై ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ 0 నుండి 5 సంవత్సరాల పిల్లలు అందిస్తున్న సేవలను మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని సిబ్బందిని అడిగి తెలుసుకుని మెరుగైన సేవలు అందించాలని, మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని ప్రతి విభాగాన్ని పరిశీలించి సూచనలు జారీ చేయడం జరిగింది. తదుపరి "బేటి బచావో" కార్యక్రమంలో భాగంగా "భేటీ జన్మోత్సవ్" నిర్వహించి నెలలోపు జన్మించిన ఆడపిల్లలకు బేటి జన్మోత్సవ్ కిట్లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది డాక్టర్ ప్రతాప్, డాక్టర్ వినోద్, నాగభూషణం, పీడియాట్రిషన్ డాక్టర్లు, జిల్లా స్థాయి ఆర్బిఎస్కే సిబ్బంది, నేషనల్ న్యూట్రిషన్ మిషన్ జిల్లా సమన్వయకర్త పి. సంపత్, సిడిపివోలు లక్ష్మీ ప్రసన్న, వెంకటరమణ, సూపర్వైజర్లు , అంగనవాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెగా ఫ్యాన్స్‌కు.. ఊహించని సర్ప్రైజ్!




మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' సినిమా కోసం రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభమైనప్పటి నుంచే భారీ హైప్ క్రియేట్ చేయగా, ఇప్పుడు దీని విడుదల తేదీ గురించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఒక స్పోర్ట్స్ డ్రామాగా, రామ్ చరణ్ కెరీర్‌లోనే అత్యంత 'రా అండ్ రస్టిక్' చిత్రంగా ఇది నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. సాధారణంగా ఏ సినిమాకైనా మేకింగ్ పక్కాగా ఉంటేనే థియేటర్లో మ్యాజిక్ రిపీట్ అవుతుంది. అందుకే ఈ సినిమాను తొలుత ఏప్రిల్ 30నే విడుదల చేయాలని మేకర్స్ భావించినప్పటికీ, ఇప్పుడు ఆ ప్లాన్ మారింది. అవుట్‌పుట్ విషయంలో దర్శకుడు బుచ్చిబాబు ఎక్కడా తగ్గకూడదని నిర్ణయించుకున్నారు. షూటింగ్ పనులు ఇంకా కొనసాగుతుండటంతో పాటు, విజువల్ ఎఫెక్ట్స్ వర్క్ అద్భుతంగా రావడానికి మరికొంత సమయం కేటాయించాలని టీమ్ భావించింది. క్వాలిటీ కోసం ఏప్రిల్ నుంచి వాయిదా వేయడమే సరైన నిర్ణయమని చిత్ర యూనిట్ ఒక అవగాహనకు వచ్చింది. విడుదల తేదీ విషయంలో ఒక గమ్మత్తైన మలుపు చోటుచేసుకుంది. తొలుత జూన్ 25న ప్రేక్షకుల ముందుకు రావాలని ప్లాన్ చేసినప్పటికీ, ఇప్పుడు జూన్ 4వ తేదీకి సినిమా షిఫ్ట్ అయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. కన్నడ స్టార్ యష్ నటించిన 'టాక్సిక్' సినిమా ఆ రేసు నుంచి తప్పుకోవడంతో, ఆ ఖాళీగా ఉన్న డేట్‌ను క్యాష్ చేసుకోవాలని 'పెద్ది' టీమ్ భావిస్తోంది. ఈ మేరకు విడుదల తేదీని ముందుకు జరిపి, సమ్మర్ సీజన్ చివరలో బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టాలని మేకర్స్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. ఒక సినిమా సక్సెస్ వెనుక కథతో పాటు సరైన రిలీజ్ టైమింగ్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. జూన్ 4వ తేదీ అయితే డిస్ట్రిబ్యూటర్లకు కూడా లాభదాయకంగా ఉంటుందని, థియేటర్ల కేటాయింపులో ఇబ్బందులు ఉండవని బుచ్చిబాబు తన బృందంతో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రామ్ చరణ్ ఈ సినిమా కోసం మేకోవర్ అయిన తీరు, ఆయన సరికొత్త లుక్ అభిమానుల్లో సెన్సేషన్ క్రియేట్ చేశాయి. ఈ డేట్ మారడం వల్ల కలిగే అడ్వాంటేజెస్ సినిమా రేంజ్‌ను మరింత పెంచుతాయని చిత్ర వర్గాల విశ్వాసం. ఏప్రిల్ నెలలోనే తమ అభిమాన హీరోను చూడాలనుకున్న మెగా ఫ్యాన్స్‌కు ఈ వాయిదా కాస్త అసంతృప్తి కలిగించినా, సినిమా రిజల్ట్ విషయంలో మాత్రం వారికి పూర్తి భరోసా కనిపిస్తోంది.

బుచ్చిబాబు తీసుకుంటున్న జాగ్రత్తలు చూస్తుంటే, 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని స్పష్టమవుతోంది. ప్రస్తుతానికి జూన్ 4వ తేదీ పరిశీలనలో ఉండగా, దీనిపై అధికారిక ప్రకటన వెలువడితే సినిమాపై ఉన్న అంచనాలు రెట్టింపు అవ్వడం ఖాయం. రామ్ చరణ్ విశ్వరూపం చూడటానికి అభిమానులు జూన్ వరకు వేచి చూడాల్సిందే.




# 'టీచర్'గా సిమ్రాన్..






దశాబ్దాల కాలంగా తన నటనతో, అందంతో వెండితెరపై మ్యాజిక్ చేసిన సీనియర్ నటి సిమ్రాన్ ఇప్పుడు సరికొత్త అవతారంలో అలరించబోతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'టీచర్' ఈ చిత్రానికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది. బాలు శర్మ దర్శకత్వం లో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రాన్ని వైట్ నైట్స్ ఎంటర్‌టైన్‌మెంట్, సూపర్ టాకీస్ బ్యానర్లపై కాశీ విశ్వనాథన్, సమీర్ భరత్ రామ్ సంయుక్తంగా నిర్మించనున్నారు. 'హిస్టరీ లెసన్స్ మరింత ఉత్కంఠభరితంగా మారబోతున్నాయి' అంటూ.. మేకర్స్ విడుదల చేసిన ఈ అనౌన్స్‌మెంట్ వీడియో చాలా ఆసక్తికరంగా ఉంది. సిమ్రాన్ వంటి పవర్‌ఫుల్ నటి ఇలాంటి పాత్రలో కనిపిస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సాధారణంగా టీచర్ అంటే పాఠాలు చెబుతూ విద్యార్థులను తీర్చిదిద్దడం చూస్తాం. కానీ ఈ సినిమాలో హిస్టరీ లెసన్స్ కాస్త 'డార్క్'గా ఉండబోతున్నాయని మేకర్స్ హింట్ ఇచ్చారు. ఈ చిత్రం త్వరలోనే షూటింగ్ ప్రారంభించుకోనుంది. ఈ సినిమా టైటిల్ లోగోలో చాక్‌పీస్‌తో పాటు గన్ (తుపాకీ) సింబల్ ఉండటం.. ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌ని తలపిస్తున్నా.. సైకలాజికల్ డ్రామాగా ఈ మూవీ ఉంటుందని మేకర్స్ తెలుపుతున్నారు. మొత్తంగా చూస్తే.. చిన్న వీడియోతోనే సినిమాపై భారీగా అంచనాలను పెంచే యడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారని చెప్పొచ్చు. ఇక టీజర్, ట్రైలర్ వంటి వాటిని ఇంకెంత వినూత్నంగా మేకర్స్ ప్లాన్ చేస్తారో.. అనే క్యూరియాసిటీని కూడా ఈ వీడియో కలగజేస్తోంది. ఇక సిమ్రాన్ విషయానికివస్తే.. టాప్ హీరోయిన్‌గాఒకప్పుడు సౌత్ ఇండస్ట్రీని ఒక ఊపు ఊపిన ఈ భామ.. పెళ్లి, పిల్లల అనంతరం మొదలెట్టిన సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా తగ్గేదేలే అనేలా దూసుకెళుతున్నారు. సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా ఆమెకు ప్రాధాన్యమున్న పాత్రలు పడుతుండటం విశేషమనే చెప్పుకోవాలి. అప్పుడు హీరోయిన్‌గానే.. ఇప్పుడు మాత్రం వైవిధ్యభరిత పాత్రలతో మరోసారి నటిగా తన సత్తా ఏంటో సిమ్రాన్ చాటుతున్నారు. ఈ 'టీచర్'తో కూడా ఆమె బ్లాక్ బస్టర్ అందుకునేలానే ఉన్నారు. చూద్దాం.. ఏం జరుగుతుందో?

## అల్లుడు శీనుని ఆట పట్టించిన కుటుంబ సభ్యులు..

# శీని అంటూ ప్రేమగా పిలిచిన భార్య



టాలీవుడ్ యువ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఆయన తన ప్రేయసి కావ్యా రెడ్డిను వివాహమాడి వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. ఆధ్యాత్మిక వాతావరణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ వివాహ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఏప్రిల్ 29 రాత్రి 11.05 గంటలకు వేద మంత్రోచ్చారణల మధ్య సాయి శ్రీనివాస్ మూడు ముళ్లు వేసి కావ్యా రెడ్డిని జీవిత భాగస్వామిగా అంగీకరించారు. సంప్రదాయ వేద పద్ధతిలో జరిగిన ఈ పెళ్లి వేడుక ఎంతో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి ఇరు కుటుంబాల పెద్దలు, సన్నిహితులు, స్నేహితులతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్యంగా మల్లు భట్టి విక్రమార్క, బి.ఆర్. నాయుడు వంటి ప్రముఖులు నూతన దంపతులను ఆశీర్వదించారు. పెళ్లి అనంతరం ఈ జంటకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అభిమానులు, సినీ ప్రముఖులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మే 1న హైదరాబాద్‌లో గ్రాండ్ రిసెప్షన్ నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఈ సందర్భంగా వధూవరులు ప్రముఖ డిజైనర్ శ్రవణ్ కుమార్ రూపొందించిన ప్రత్యేక దుస్తుల్లో మెరవనున్నారని తెలుస్తోంది.కావ్యా రెడ్డి సినిమా రంగానికి చెందిన వారు కాకపోయినా, ప్రముఖ న్యాయవాది కుటుంబానికి చెందినవారు. కొంతకాలంగా ప్రేమలో ఉన్న ఈ జంట, ఇరు కుటుంబాల అంగీకారంతో ఇప్పుడు వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. హిందూ సంప్రదాయం ప్రకారం కొత్తగా పెళ్లైన జంట ఇంట్లోకి వెళ్లేముందు పేర్లు చెప్పే సంప్రదాయం ఉంటుంది. ఈ క్రమంలోనే బెల్లంకొండ శ్రీనివాస్, కావ్య రెడ్డి పేర్లు చెప్పారు. ముందుగా కొత్త కోడలు.. నేను కావ్య బెల్లంకొండ. మా వారు సాయి శ్రీనివాస్ బెల్లంకొండతో మా ఇంటికి కొత్త కోడలిగా వచ్చాను అని కావ్య రెడ్డి క్యూట్ గా చెప్పింది. ఆ తర్వాత బెల్లంకొండ శ్రీనివాస్ .."మా ఇంటికి మా ఆవిడను తీసుకొచ్చాను. మీరంతా ఏంటీ? జరగండి" అని అంటాడు. సరిగ్గా చెప్పాలని అందరూ అడుగుతారు. అప్పుడు కావ్య రెడ్డి తన భర్తను 'చెప్పు శ్రీని' అని అడుగుతుంది. అప్పుడు నా భార్య కావ్య బెల్లంకొండతో మా ఇంటికి వచ్చా. నా పేరు అల్లుడు శీను. అల్లుడు శీనుగా వచ్చా' అని బెల్లంకొండ శ్రీనివాస్ చెప్పాడు. దీంతో ఈ వీడియో వైరల్‌గా మారింది.

## అబ్బాస్ సెకండ్ ఇన్నింగ్స్.. ఆకట్టుకుంటున్న 'ఎగ్జామ్' వెబ్ సిరీస్ ట్రైలర్!

తమిళ నటుడు అబ్బాస్ తన సెకండ్ ఇన్నింగ్స్‌లో దూసుకుపోతున్నారు. ఇప్పటికే 'హ్యాపీరాజ్' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న ఆయన, ఇప్పుడు ఓ ఆసక్తికరమైన వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ప్రస్తుత పోటీ పరీక్షల ప్రపంచంలో జరిగే అక్రమాలు, పేపర్ లీకేజీలు మరియు వ్యవస్థలోని లొసుగుల ఇతివృత్తంతో రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ సిరీస్ 'ఎగ్జామ్'. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో మే 15 నుంచి తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ మరియు మలయాళ భాషల్లో ఈ సిరీస్ అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ సిరీస్ ట్రైలర్ చూస్తుంటే, కథ అంతా పోటీ పరీక్షల ప్రపంచంలో జరిగే అవినీతి చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ఒక సామాన్య యువతి (దుశారా విజయన్) ఈ వ్యవస్థలోని లోపాలను ఎలా ఎండగట్టిందనేది ఇందులో ప్రధానాంశం. దుశారా విజయన్, అదితి బాలన్ ప్రధాన పాత్రల్లో నటించగా, అబ్బాస్ ఒక కీలక పాత్రలో కనిపిస్తున్నారు. ఈ సిరీస్‌కు ప్రముఖ మేకర్స్ పుష్కర్ – గాయత్రి క్రియేటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరించగా, ఎ. సర్కుణం దర్శకత్వం వహించారు.




# 'రాజా శివాజీ'లో సల్మాన్ ఖాన్ మాస్ ఎంట్రీ..






బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్ స్వీయ దర్శకత్వంలో వచ్చిన హిస్టారికల్ మూవీ 'రాజా శివాజీ' బాక్సాఫీస్ వద్ద రికార్డుల ప్రభంజనం సృష్టిస్తోంది. మే 1న మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఇప్పటికే మంచి టాక్‌తో దూసుకుపోతుండగా తాజాగా ఈ మూవీ నుంచి క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ అతిథి పాత్రలో మెరిశాడు. దీంతో సల్మాన్‌ను చూసిన అభిమానులు థియేటర్‌లలో ఈలలు, కేకలతో సంబరాలు చేసుకుంటున్నారు. ఈ చిత్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ అత్యంత నమ్మకమైన అంగరక్షకుడు, వీర యోధుడు జీవా మహల్ పాత్రలో సల్మాన్ ఖాన్ మెరిశారు. అఫ్జల్ ఖాన్‌తో జరిగిన యుద్ధంలో శివాజీ ప్రాణాలను కాపాడిన వ్యక్తిగా జీవా మహల్‌కు చరిత్రలో గొప్ప పేరుంది. ఈ వీరోచితమైన పాత్రలో సల్మాన్‌ను చూడటం అభిమానులకు కన్నుల పండుగగా మారింది. కాషాయ తలపాగా ధరించి, చేతిలో కత్తి పట్టి సల్మాన్ ఇచ్చే ఎంట్రీ సీన్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తోంది. మరోవైపు ఈ పాత్ర వెనుక ఉన్న ఆసక్తికరమైన విషయాన్ని రితేష్ దేశ్‌ముఖ్ పంచుకుంటూ, తానే స్వయంగా వెళ్లి సల్మాన్‌ను అడగలేదని, ఒక పార్టీలో కలిసినప్పుడు ఈ సినిమా గురించి తెలిసిన సల్మాన్.. "నేను లేకుండా నువ్వు ఈ సినిమా ఎలా చేస్తావ్? ఖచ్చితంగా నాకు ఒక పాత్ర ఉండాల్సిందే" అని పట్టుబట్టి మరీ ఈ క్యామియో చేసినట్లు తెలిపారు. రితేష్ గత చిత్రాలు 'లై భారీ', 'వేద్' సినిమాల తరహాలోనే ఈ చిత్రంతోనూ సల్మాన్ తన స్నేహాన్ని చాటుకున్నారు.

సుమారు 100 కోట్ల భారీ బడ్జెట్‌తో మరాఠీ, హిందీలో కూడా విడుదలైన ఈ సినిమాలో జెనీలియా, సంజయ్ దత్, అభిషేక్ బచ్చన్, విద్యాబాలన్ వంటి దిగ్గజ తారాగణం నటించగా, అజయ్–అతుల్ సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. సల్మాన్ ఖాన్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో 'రాజా శివాజీ' చిత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో సైతం సెన్సేషన్‌గా మారింది.

# 'పెద్ది' కోసం శృతి హాసన్ భారీ రెమ్యునరేషన్..



కోలీవుడ్ బ్యూటీ శృతి హాసన్ పేరు మార్మోగిపోతోంది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ ప్రాజెక్ట్ 'పెద్ది'లో ఆమె స్పెషల్ సాంగ్ చేస్తుందనే వార్త ఇప్పటికే సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోంది. షూటింగ్ లొకేషన్ నుంచి కొన్ని వీడియోలు లీక్ అవ్వడంతో ఈ విషయంపై క్లారిటీ వచ్చేసింది. అయితే ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తున్న విషయం ఏమిటంటే.. ఈ ఒక్క పాట కోసం శృతి అందుకున్న భారీ పారితోషికం. సాధారణంగా శృతి హాసన్ ఒక సినిమాకు హీరోయిన్‌గా చేస్తే దాదాపు రూ. 3 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటుంది. కానీ 'పెద్ది' సినిమాలో కేవలం ఒకే ఒక్క పాట కోసం ఆమె ఏకంగా రూ. 3.5 కోట్లు డిమాండ్ చేసిందని, మేకర్స్ కూడా అందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. హీరోయిన్‌గా చేస్తే దాదాపు 30 నుంచి 40 రోజుల పాటు కాల్ షీట్స్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఈ స్పెషల్ సాంగ్ కోసం కేవలం 3 నుంచి 4 రోజులు షూటింగ్ చేస్తే సరిపోతుంది. తక్కువ రోజుల్లోనే హీరోయిన్ రెమ్యునరేషన్ కంటే ఎక్కువ సంపాదిస్తుండటంతో నెటిజన్లు నోరెళ్లబెడుతున్నారు.ఇటీవల కాలంలో స్టార్ హీరోయిన్లు స్పెషల్ సాంగ్స్ కోసం భారీగా ఛార్జ్ చేస్తున్నారు. 'స్త్రీ 2'లో తమన్నా, 'కూలీ' సినిమాలో పూజా హెగ్డే ఒక్కో పాటకు రూ. 3 కోట్లు తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు శృతి హాసన్ వారిని కూడా దాటేసి రూ. 3.5 కోట్లు తీసుకోవడం సినీ సర్కిల్స్‌లో చర్చనీయాంశమైంది. రామ్ చరణ్ సరసన గతంలో 'ఎవడు' సినిమాలో హీరోయిన్‌గా నటించిన శృతి, చాలా కాలం తర్వాత మళ్ళీ ఆయన పక్కన మాస్ స్టెప్పులు వేయబోతోంది. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఆయన కంపోజ్ చేసిన ఊర మాస్ ట్యూన్ కు రామ్ చరణ్ గ్రేస్, శృతి హాసన్ ఎనర్జీ తోడైతే థియేటర్లు దద్దరిల్లడం ఖాయమని చిత్రబృందం నమ్మకంగా ఉంది. ఈ పాట సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుందని టాక్. తక్కువ పనికే ఎక్కువ లాభం ఉండటంతో శృతి హాసన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది.

# రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా కష్టపడుతున్నా

## ఉద్యోగ భద్రత కోసం మేడే స్ఫూర్తితో పోరాటం చేద్దాం



రాజాపేట (తెలంగాణ వాణి విలేకరి): ప్రభుత్వ, ప్రైవేటు సెక్టర్ లో పనిచేసే అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల ఉద్యోగ భద్రత కోసం ప్రభుత్వాలపై మేడే స్ఫూర్తితో పోరాటాల్లో పాల్గొనాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బూరుగు స్వప్న పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో సిఐటియు జెండాను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న పాలకులు మారుతున్న అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల స్థితిగతులు మాత్రం మారడం లేదన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికుల పట్ల నిరంకుశ వైఖరితో ఉందని కేంద్ర ప్రభుత్వ స్కీములో పనిచేసే అనేకమంది కార్మికులు ఉద్యోగ భద్రత లేక పనికి తగ్గ వేతనంలేక దినదిన గండంగాజీవితాలను గడుపుతున్నారని దీనికి తోడుగా నాలుగు లేబర్ కోడ్లు తీసుకువచ్చి కార్మికుల పొట్ట గొట్టాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం చూస్తుందన్నారు. పోరాటాలు చేయకుంటే ప్రభుత్వం మరింత నిరంకుశత్వానికి తెగబడుతుందని మేడే స్ఫూర్తితో ఉద్యోగ భద్రత కోసం కనీస వేతనాల కోసం ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, బీడీ కార్మిక సంఘం జిల్లా నాయకులు పబ్బోజు రాధమ్మ, ప్రజా సంఘాల కటికల రామచంద్రం, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కోట రవికుమార్ అంగన్వాడీలు నాయకులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక వాహనాన్ని ప్రారంభించిన మంత్రి మండిపల్లి

రాయచోటి : లక్కిరెడ్డిపల్లి టౌన్ ఫైర్ స్టేషన్లో నూతనంగా ఏర్పాటు చేసిన అగ్నిమాపక వాహనాన్ని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడటంలో అగ్నిమాపక శాఖ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ అగ్నిమాపక వాహనం ద్వారా సేవలు మరింత వేగంగా, సమర్థవంతంగా అందుతాయని పేర్కొన్నారు.

ప్రజల భద్రత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మరింత బలోపేతం అవుతాయని, అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.

**ప్రజల సంతోషం చూసి కష్టాలు మరచి పోతున్నా**

**ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రానికి పూర్వ వైభవం**

**లేబర్ అడ్డాలను స్కిల్ సెంటర్లుగా అభివృద్ధికి నిర్ణయం**

**గోదావరి పుష్కరాల్లోపే పోలవరం పూర్తి చేస్తాం**

**విద్యుత్ చార్జీలు పెంచలేదు..ఇకముందు పెంచబోం**

**కృష్ణా జిల్లా పమిడిముక్కలలో 'పేదల సేవ'లో సిఎం బాబు**





విజయవాడ, : రాష్ట్రాభివృద్ధి కోసం రాత్రిపగలు కష్టపడుతున్నామని, పేదల రుణం తీర్చుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజల సంతోషాన్ని చూసి.. కష్టాన్ని మరిచిపోతున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, ఏపీకి పూర్వవైభవం తీసుకొస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పింఛన్ల కోసం ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. పింఛన్ల పంపిణీని భారంగా భావించట్లేదు.. బాధ్యతగా భావిస్తున్నామని చంద్రబాబు అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వట్లేదు. కార్మికుల కోసం లేబర్ అడ్డా నిర్మాణాలు చేపడుతున్నాం. లేబర్ అడ్డాలు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లుగా మారాలి. పని ఉంటే పనికెళ్తారు.. లేని రోజు లేబర్ అడ్డాల్లో నైపుణ్యం పెంచుకుంటారు. తొలి దశలో లేబర్ అడ్డాలు విజయవంతమైతే.. మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తాం అని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ప్రస్తుతం మళ్లీ వెయ్యి కోట్లతో పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తున్నాం. 2027లో గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేస్తాం. ఆ తర్వాత కృష్ణా నదికి అనుసంధానిస్తాం. డిసెంబర్ నాటికి బందర్పోర్టు నిర్మాణం పూర్తి చేస్తాం. హైదరాబాద్- మచిలీపట్నం హైవే ఎక్స్ప్రెస్ రోడ్డుగా అభివృద్ధి చెందుతోంది. విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. ఇప్పటి వరకు పెంచలేదు. ఎన్నికలయ్యే వరకు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇస్తున్నానని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వం విధించిన ట్రూఅప్ ఛార్జీలను ట్రూడౌన్ చేశాం. గత ప్రభుత్వం 9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని విమర్శించారు. ఇకపై ప్రతి సమావేశంలోనూ ఎమ్మెల్యే పనితీరు గురించి ప్రజలనే అడుగుతా. ఎమ్మెల్యే పనితీరు సరిగా లేకుంటే.. వారికి ఇంకొక ఛాన్స్ ఉండదు. అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలులో ఈఎస్ఐ ఆస్పత్రులు తీసుకొస్తాం. శ్రీసిటీ, తిరుపతి, అమరావతిలో ఈఎస్ఐ ఆస్పత్రులు తీసుకొస్తాం. అందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే మా లక్ష్యం. నేర ప్రవృత్తి వ్యక్తులు రాజకీయాలకు పనికిరారు. వైకాపా అధినేతకు మానసిక సమస్య ఉంది. ఒకసారి అవకాశమిస్తే అందర్నీ మోసం, నాశనం చేశారు. ప్రజావేదికను నిర్మిస్తే.. రెండు గంటల్లో కూల్చేశారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టును నాశనం చేశారు. అమరావతిని శ్మశానం అని ప్రచారం చేశారు. పోలవరం పూర్తయి ఉంటే.. రైతులు బంగారం పండించేవారు. నీటి ఎద్దడి ఉండేది కాదు. గొడ్డలి పార్టీకి మద్దతిచ్చేవారు ఒకసారి ఆలోచించుకోండి. బాబాయిని హత్య చేసి గుండెపోటు అన్నారు. మరుసటి రోజు నా చేతిలో కత్తి పెట్టి.. నారాసుర రక్త చరిత్ర అని 'సాక్షి'లో రాశారు. విపక్షంలో ఉండేది వైకాపా కాదు.. గొడ్డలి పార్టీ అని చంద్రబాబు అన్నారు. ఈమేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పార్టీ కాదని.. కోడికత్తి, గొడ్డలి పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. జగన్కు మానసిక సమస్య ఉందని సెటైర్లు గుప్పించారు. ప్రజలు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని నాశనం చేశారని.. అలా చేయడమే ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు. ఆయన మానసిక పరిస్థితి అందరినీ మోసం చేయడమేనని.. ఆ తర్వాత మాట మార్చడమే పనిగా పెట్టుకున్నారని ఆక్షేపించారు. 2019లో అధికారంలోకి వచ్చిన తొలి సమావేశంలోనే ప్రజావేదికను కూల్చేశారని ధ్వజమెత్తారు. రెండేళ్లు కష్టపడి కడితే.. రెండు గంటల్లోనే దానిని కూల్చేశారని మండిపడ్డారు. అమరావతి రాజధాని కావడంతో స్థానిక రైతుల దశా దిశ మారిపోయిందని చెప్పుకొచ్చారు. విశాఖపట్నం తర్వాత అభివృద్ధి, ఆదాయంలో ముందుండేది కృష్ణా జిల్లా అని పేర్కొన్నారు. కార్మికుల కోసం అత్యాధునిక పనిముట్లతో తొలి దశలో 15 నగరాల్లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను నిర్మిస్తామని ఉద్ఘాటించారు. తొలి దశలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు విజయవంతమైతే.. మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తామని చెప్పుకొచ్చారు. తానూ రైతు కుటుంబం నుంచే వచ్చానని.. వారి కష్టం తనకు తెలుసునని ప్రస్తావించారు. జగన్ హయాంలో ప్రజలు, నేతలు బయట తిరిగే పరిస్థితి లేదని పేర్కొన్నారు.ఏపీలో ప్రజలందరికీ మరో స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన ఘనత ఎన్డీఏదేనని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రతి సమావేశంలో ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజలనే అడుగుతానని అన్నారు. ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేకుంటే.. వారికి మరోసారి సీటు ఇచ్చే ఛాన్స్ ఉండదని స్పష్టం చేశారు. పోలవరం కోసం కష్టపడి తాము 70 శాతానికి పైగా పనులు పూర్తి చేశామని.. అలాంటి ప్రాజెక్టును నాశనం చేసి.. జగన్ హయాంలో ఆ పనులు నిలిపివేశారని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. అమరావతి ప్రజా రాజధాని.. మన మైథాలజీలో దేవతల రాజధాని అని అభివర్ణించారు. అలాంటి అమరావతిని ఎడారి అని, శ్మశానమని మొత్తం నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణం చేస్తుంటే.. వారు విధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. మళ్లీ అలాంటి విధ్వంసకర పాలన అధికారంలోకి రాకూడదని ప్రజలు గుర్తించాలని అన్నారు. నరకాసుడి వధ కారణంగా మనం దీపావళి చేసుకుంటున్నామని.. దుర్మార్గుడు చనిపోయారని.. సమాజం బాగుపడింది.. అంటే అలాంటి వారిని మళ్లీ సమర్థించకూడదని అర్థమని అన్నారు. ప్రతి ఒక్కరూ మీ గుండె మీద చేయి వేసుకుని ఆలోచన చేయాలని కోరారు. 2019లో జగన్ మోసాలు తెలుసుకోకుండా.. ఓట్లు వేసి 151 సీట్లు ఆయనకు ఇచ్చి గెలిపించారని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. జగన్ హయాంలోని ఐదేళ్లు విధ్వంసకర పాలన చేశారని ఆగ్రహించారు. తాను, మోదీ, పవన్ కల్యాణ్ కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తే 94శాతం సీట్లతో గెలిపించారని తెలిపారు. తాను అభివృద్ధి చేయడం.. ఆ తర్వాత ఎవరో వచ్చి నాశనం చేయడం ఇలా అవసరమా అని ప్రశ్నించారు. ప్రజలంతా ఆలోచన చేసి.. మరోసారి ఎన్డీఏకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.. సుపరిపాలన ఇచ్చే బాధ్యత తమదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సమావేశంలో మంత్రి వాసంశెట్టి ఇసుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్‌లో ఘనంగా మే డే వేడుకలు



ఆదిలాబాద్, మే : 01 ( తెలంగాణ వాణి ప్రతినిధి ): కార్మికులు తమ హక్కులతో పాటు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం స్థానిక ద్వారకానగర్ లోని మేస్త్రి సంఘ భవనంలో మే డే (అంతర్జాతీయ కార్మిక దినోత్సవం) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల శంకర్ తో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కార్మికులు తమ హక్కులతో పాటు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ కార్మికుల సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉంటుందని, ముఖ్యంగా భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. రక్తాన్ని చెమటగా మార్చి దేశాభివృద్ధికి తోడ్పడుతున్న ప్రతి కార్మికునికి శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో కార్మికులు ఎదుర్కొన్న సమస్యలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ముఖ్యంగా కార్మికులకు రావాల్సిన ఈఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే వారి కుటుంబాలను ఆదుకునేందుకు బీమా సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. అనంతరం కార్మికులకు శిక్షణ అందిస్తున్న పలువురు సిబ్బందికి ప్రశంసా పత్రం, మెమెంటోను కలెక్టర్, ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి గంగారాం, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రాజేశ్వరి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చందన్ కుమార్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అరుగుల అశోక్, ఐటిఐ ఏ టి ఓ.ఆర్.శ్రీనివాస్, మేస్త్రీ సంఘం నాయకులు బండారి పోశన్న, సామల సత్యనారాయణ, రమేష్, ఇతర అధికారులు, సిబ్బంది, మేస్త్రిలు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగుంటపల్లి గ్రామంలో కార్మిక దినోత్సవం వేడుకలు

### -జెండా ఆవిష్కరించిన గ్రామ శాఖ అధ్యక్షులు చిట్యాల మహేందర్



కోహెడ:మే 01(తెలంగాణ వాణి విలేకరి): మే డే సందర్భంగా శుక్రవారం రోజున సిద్దిపేట జిల్లా కోహెడ మండలం ఎర్రగుంటపల్లి గ్రామంలో హమాలీ సంఘం"ఏఐటియుసి"ఆధ్వర్యంలో గ్రామ శాఖ అధ్యక్షులు చిట్యాల మహేందర్ కార్మికులతో కలిసి డప్పు చెప్పులతో ర్యాలీతీసి జెండా ఆవిష్కరణ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ గంప భాగ్యలక్ష్మి ముత్యం ర్యాలీలో పాల్గొని జెండా వద్దకు వచ్చి కొబ్బరికాయ కొట్టి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఈరోజు కార్మికులకు పండుగ రోజు అని ఎందుకంటే గతంలో 1889లో చికాగో నగరం అమెరికాలో కార్మికులు పని గంటలకు కోసం పోరాడి ఎంతోమంది అక్కడ రక్తం చిందించిన పరిస్థితి ఉండే ఆ రోజుల్లో కార్మికులు 14 గంటలు పనిచేసే అవకాశం ఉండేది పొద్దున 8 గంటలకు పనికి పోతే రాత్రి 10,11, గంటలకు ఇంటికి వచ్చేవారు. ఆ రోజుల్లో కార్మికులందరూ కులమతాలకు అతీతంగా మూడు రోజులపాటు సమ్మె చేస్తే అక్కడే కార్మికులు ఎంతో మంది పోలీస్ కాల్పుల్లో చనిపోయిన పరిస్థితి చనిపోయిన కార్మికుల రక్తం మరకల బట్టలను పైకెత్తి ఎర్రజెండాగా మార్చిన చరిత్ర రక్తం మరకలతో తడిచిన జెండా ఈరోజు ఎర్రజెండాగా మారింది అని అన్నారు.

ఈరోజు కార్మికులందరూ మేడే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆరోజు చేసిన పోరాటం వల్ల ఈరోజు 8 గంటల పని దినం మనకు ఉంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిట్యాల సతీష్ కుమార్, వార్డు సభ్యులు గొల్లన రాజు, చిట్యాల రవీందర్,మాజీ సర్పంచ్ నాగు మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శెట్టి సుధాకర్, గంప ముత్యం,బిఆర్ఎస్ నాయకులు నాగు రవీందర్, శాతవేణి పోషయ్య,రామస్వామి,గంప రమేష్,చిట్యాల సతీష్,నాగు నరేష్,చిట్యాల శంకర్,సంపత్, రాజమల్లు,రమేష్,రాజు రమేష్,చంద్రయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు తమ వృత్తులలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి: జిల్లా కలెక్టర్ భవేశ మిశ్రా

### కలెక్టరేట్లో ఘనంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం



నిర్మల్,మే :01(తెలంగాణ వాణి ప్రతినిధి): కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శుక్రవారం మేడే (అంతర్జాతీయ కార్మిక దినోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రపంచ అభివృద్ధికి కార్మికులే ఛోదక శక్తి అని అన్నారు. కార్మికులు అందరూ తమ తమ వృత్తులకు సంబంధించి నైపుణ్యాలు పెంపొందించుకోవడం వల్ల, ఉన్నతి సాధించగలుగుతారని వివరించారు. ప్రతి ఒక్కరూ కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్మికులకు, ప్రభుత్వాలు అమలుపరుస్తున్న పథకాలు పొందాలని చెప్పారు. నైపుణ్యాలు ఉన్న కార్మికులకు విదేశాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని.. కార్మికులు తదనుగుణంగా ఆలోచన చేసి అవకాశాలు అందిపుచ్చుకోవాలని వివరించారు. ప్రభుత్వాలు కూడా కార్మికుల్లో నైపుణ్యాలు పెంచేందుకు శిక్షణలు ఇస్తున్నాయని, కార్మికులు వాటిని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్మిక శాఖ "అచీవ్మెంట్స్, ఆక్టివిటీస్" బుక్ లెట్ ఆవిష్కరించారు. పలువురు కార్మికులకు జ్ఞాపికలు అందించి, శాలువాలతో సత్కరించారు.

అనంతరం అధికారులు, కార్మికులు కలెక్టర్ కు జ్ఞాపిక అందించి, శాలువాతో సన్మానించారు. ఈ కార్మికదినోత్సవ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ (కిషోర్) కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ముత్యం రెడ్డి, కార్మిక శాఖ అధికారి రాజలింగు, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, కోటిరెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా..

## చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్, మే:01(తెలంగాణ వాణి ప్రతినిధి): జిల్లాలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వేసవికాలం త్రాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రజలకు అందిస్తున్న త్రాగునీటి గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా ప్రజలకు త్రాగునీటికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎక్కడైనా ప్రజలకు త్రాగునీరు అందించడంలో ఇబ్బందులు ఎదురైతే, అధికారులు వెంటనే స్పందించి, త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని అన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలలో ఎక్కడైనా తాగునీటి సరఫరా పైపులు లీకేజీలు, మరమ్మత్తులు ఉంటే రిపేర్లు చేపట్టాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలలో త్రాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, డిపిఓ శ్రీనివాస్, జెడ్పి సీఈవో భాగ్యలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com